Follow: @ANNTELUGU

17-07-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 194 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## తెలంగాణలో మొదలైన జాతర జోష్

- తెలంగాణలో మొదలైన జాతర జోష్
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన కొండా సురేఖ, పొన్నం
- ఆలయ కమిటీకి రూ. 11 లక్షల చెక్కు అందజేత
- భక్తి పారవశ్యంతో ఊగిపోతున్న గోల్కొండ పరిసరాలు

**హైదరాబాద్, మహా :** భాగ్యనగర సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఆషాఢ మాస బోనాల జాతర అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య ప్రారంభమైంది. గురువారం లంగర్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, అటవీ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్.. మంత్రి కొండా సురేఖకు సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తడం విశేషంగా నిలిచింది. శ్రీ గోల్కొండ జగదాంబికా మహంకాళి ఎల్లమ్మ అమ్మవారికి ప్రభుత్వ పక్షాన మంత్రులు అధికారికంగా పట్టువస్త్రాలు,

మిగతా 2వ పేజీలో


టాప్ న్యూస్



### బీజేపీ అధికారంలోకి వస్తే విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తాం

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- సైదాబాద్ సక్సెస్ స్కూల్ పై బండి సీరియస్

03



### సెప్టెంబర్‌లో స్థానిక ఎన్నికలు

ఏపీ ప్రభుత్వయోచన

02



### గజమాలలు, పాలాభిషేకాలపై నిషేధం

- టీపీసీసీ సంచలన సర్క్యులర్
- భజన సంస్కృతి బంద్

03




జస్ట్.. సిక్స్ మంత్స్ చాలు

# జమిలికి మేం రెడీ

## అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలు ఒకేసారి పెట్టేస్తామంటున్న సీఈసీ

- జమిలిపై జేపీసీకి లిఖితపూర్వక నివేదిక సమర్పించిన ఈసీ
- అదనపు ఏర్పాట్లపై ఈసీ వివరణ కోరనున్న జేపీసీ
- తుది నివేదికలో సిఫారసులు చేర్చనున్న జాయింట్ కమిటీ
- రాజ్యాంగ సవరణతో జమిలికి మార్గం సుగమం
- జమిలి ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

**ఢిల్లీ, మహా :** కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' ప్రకారం ఒకేసారి అసెంబ్లీలకు, పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించడానికి రెడీ అంటోంది కేంద్ర ఎన్నికల సంఘం.జమిలి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమేనని కేంద్ర ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. ఆరు నెలల సమయం ఇస్తే చాలు.. దానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటామని కూడా ఈసీ సంచలన ప్రకటన చేసింద. జమిలి ఎన్నికలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ స్టడీ చేస్తున్న క్రమంలో ఈసీ ప్రతినిధులు హాజరై పై అభిప్రాయాన్ని లిఖితపూర్వకంగా నివేదిక రూపంలో వెల్లడించారు. ఒకవైపు పార్టీలు, మరోవైపు మేధావులు, ఇంకోవైపు సోషల్ సైంటిస్టులతో ముమ్మరంగా సమావేశాలు జరుపుతున్న జేపీసీ తాజాగా ఎలక్షన్ కమిషన్ అభిప్రాయాన్ని తీసుకోడానికి ఆహ్వానించింది. రాజ్యాంగ సవరణ చేయాల్సి వస్తున్నందున ఎన్నికల నిర్వహణలో ఈసీకి ఉన్న ప్రాక్టికల్ ఇబ్బందులను కూడా తెలుసుకున్నది. ఇదే విషయాన్ని జేపీసీ చైర్మన్ పీపీ చౌదరి లక్నోలో మీడియాతో మాట్లాడుతూ.. ఆరు నెలల సమయం ఇస్తే తగిన ఏర్పాట్లు చేసుకుని జమిలి ఎన్నికలను నిర్వహించడాని సిద్ధంగా ఉన్నదని ఈసీ ఇచ్చిన నివేదికను ధృవీకరించారు. కానీ జమిలి ఎన్నికలను ఏ పద్ధతిలో నిర్వహిస్తారో, దానికి అదనంగా కావాల్సిన మ్యాన్ పవర్, ఎక్విప్‌మెంట్.. ఇలాంటి అంశాలపై ఈసీ నుంచి మరింత వివరణ తీసుకోవాల్సి ఉన్నదని, ఇంకోసారి సమావేశమైన తర్వాతనే స్పష్టత వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తాము తుది నివేదికను సమర్పించే సమయానికి ఈసీ నుంచి వివరణ తీసుకుని వాటిని పొందుపరుస్తామని, జమిలి ఎన్నికల్లోని అనుకూల, ప్రతికూల అంశాలను కూడా ప్రభుత్వానికి వివరించి తగిన సిఫారసులు చేస్తామని తెలిపారు. కేంద్రం ప్రతిపాదించిన 50శాతం ఫార్ములాపై విపక్షాలకు అభ్యంతరాలున్నా ఇపుడు లోక్ సభలో బలాబలాలు మారిన నేపథ్యంలో.. జమిలి ఖాయమన్న అంచనాలో రాజకీయవర్గాలున్నాయి.



### జులై 20 నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు

02

ఐదు కీలక బిల్లులకు కేంద్రం సిద్ధం



# ఏపీ మంత్రినా మజాకా..!

## అధికారుల బరితెగింపు..!

### రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ శాఖలకు భారీగా ముట్టిన ముడుపులు..?

ఆరో అంతస్తుకు సన్నాహాలు...

అడ్డుకట్ట వేయని యంత్రాంగం..!

అటువైపు కన్నెత్తి చూడని అధికారులు...

సీఎంసీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే బిల్డర్ల అరాచకం..!

కలెక్టర్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు శూన్యం..!

అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికార యంత్రాంగంపై ప్రజల ఆగ్రహం..!

02

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో, హైటెక్ సిటీ నడిబొడ్డున ప్రభుత్వ నిషిద్ధ 22(ఎ) ఆస్తుల జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిపై జరుగుతున్న అక్రమ నిర్మాణాల వ్యవహారం రోజురోజుకూ తీవ్ర దుమారం రేపుతోంది.. సర్వే నంబర్లు 11/33, 11/34 లలోని సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమి ఆక్రమణ, దానిపై కొనసాగుతున్న భారీ నిర్మాణాలపై వరుసగా ఫిర్యాదులు, వార్తా కథనాలు వెలుగులోకి వస్తున్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సుమారు రూ.100 కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమిపై నిర్మాణాలు కొనసాగుతుండగా.. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇతర సంబంధిత విభాగాలు మౌనం పాటించడం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయాని దానికి తోడు అధికారులకు భారీ మొత్తములో ముడుపులు ముట్టాయానేందుకు వాస్తవ పరిస్థితులు తేటతెల్లం చేస్తున్నాయి.ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యతలో ఉన్న ప్రజాప్రతినిధులే వాటిపైనే కన్నేస్తే కంచే చేను మేస్తే అనే చందంగా ఖానామేట్ వ్యవహారం నిలువెత్తు నిదర్శనంగా పేర్కొనవచ్చును. పక్క రాష్ట్రానికి చెందిన ఓ మంత్రి తెలంగాణలోని విలువైన ప్రభుత్వ భూమిని దురాక్రమణకు పాల్పడ్డారనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మంత్రి పేరు ఈ భూ దందా వ్యవహారంలో వినిపిస్తుండటంతో ఖానామేట్ భూ వివాదం ఇప్పుడు రెండు రాష్ట్రాలలో హాట్ టాపిక్‌గా మారింది.

**ఖానామేట్ ప్రభుత్వ భూమి కబ్జా వెనుక ఆ ఏపీ మంత్రి ఎవరు..? రేపటి మహా పత్రికలో ప్రత్యేక కథనం**

## హైదరాబాద్ లో డ్రగ్స్ కలకలం

పోలీసులకు చిక్కిన ఎమ్మెల్సీ కుమారుడు

మరో ముగ్గురి అరెస్టు, పరారీలో ఉన్న నలుగురి కోసం గాలింపు

02



## సాగునీటి రంగంలో కొత్త అధ్యాయం

- ఇరిగేషన్ ను బీఆర్ఎస్ భ్రష్టుపట్టించింది
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటితో కలిసి సీతారామ పరిశీలన

02



## పూరీ రథయాత్రలో తొక్కిసలాట

.. ఒకరు మృతి.. 120 మందికి గాయాలు

**పూరీ :** ఒడిశాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం పూరీలో జరుగుతున్న జగన్నాథుడి రథయాత్రలో గురువారం ఘోర విషాదం చోటుచేసుకుంది. జగన్నాథ రథయాత్ర చూసేందుకు భారీగా తరలి వచ్చిన జనసమూహాన్ని నియంత్రించే క్రమంలో ఒక్కసారిగా తొక్కిసలాట లాంటి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ దుర్ఘటనలో ఒక భక్తుడు ప్రాణాలు కోల్పోగా, సుమారు 100 నుండి 120 మంది వరకు తీవ్రంగా గాయపడ్డట్టు సమాచారం.




# ఏపీ మంత్రినా మజాకా..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కూకట్‌పల్లి జోన్, మాదాపూర్ సర్కిల్ పరిధిలోని ఖానామేట్‌లో ప్రభుత్వ నిషేధిత 22(ఎ) జాబితాలో నమోదైన కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిపై కొనసాగుతున్న నిర్మాణాలు అధికార యంత్రాంగ పనితీరు నవ్వి పోదురు గాక నాకేమి సిగ్గు అనే విధంగా తయారయింది. సర్వే నంబర్లు 11/33, 11/34ల లోని సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమిలో రాత్రింబవళ్ళు బహుళ అంతస్తుల నిర్మాణాలు కొన సాగుతున్నాయంటూ స్థానికులు గగ్గోలు పెడుతూ సంబంధిత శాఖల ప్రజావాణిలో పదుల సంఖ్యలో ఫిర్యాదులు ఇచ్చినప్పటికీ అక్రమ నిర్మాణలను అడ్డుకోవడం లో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని, చర్యల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు. ఒకవైపు భూమి ప్రభుత్వానికి చెందినదా కాదా అన్న అంశం రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తుందని మున్సిపల్ అధికారులు చెబుతుండగా, మరోవైపు నిర్మాణాల నియంత్రణ బాధ్యత మున్సిపల్ శాఖదేనని రెవెన్యూ అధికారులు పేర్కొంటూ రెండు శాఖలు బాధ్యతలను విస్మరించి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం బాధ్యతా రహిత్యానికి అద్దం పడుతుంది. గతంలో పని చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేశారు. అప్పుడు అక్రమం అని తేల్చి కూల్చివేతలు జరిపిన అధికారులు ఇప్పుడు ఎందుకు అడ్డుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదే అదునుగా బావించిన అక్రమార్కులు నిర్భయంగా రేయింబవళ్ళు పనులు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఐదు అంతస్తుల నిర్మాణం పూర్తికాగా, ప్రస్తుతం ఆరో అంతస్తు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లో భూమి నిషేధిత 22(ఎ) జాబితాలో నమోదై ఉన్నట్లు స్వయంగా కలెక్టర్ నివేదిక, రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. పలు ఫిర్యాదులు వెల్లువెత్తినప్పటికీ నిర్మాణ పనులు ఆగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. హైటెక్ సిటీ నడిబొడ్డున, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి సమీపంలోనే ఈ నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పైన స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో అధికారులు వెంటనే స్పందించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రభుత్వ భూమి వ్యవహారం లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆర్ల శ్రీనివాస్ ను మహా ప్రతినిధి ప్రశ్నించగా నాకేం తెలియదు తహాసీల్దార్ కే తెలుసు అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.



## అవినీతి తిమింగలాలపై ఏసీబీ నజర్ ఏది..?

హైదరాబాద్ పరిధిలో ఇటీవల హెచ్ఎండిఎ లో చీఫ్ ఇంజనీర్ గా పని చేస్తున్న రవీందర్ నివాసంలో ఏసీబీ నిర్వహించిన సోదాలు, భారీ మొత్తంలో ఆస్తులు బయట పడటంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా శేరిలింగంపల్లి తహసీల్దార్ గా సుధీర్ఘ కాలంగా పనిచేసిన వంశీ మోహన్ రెండు దఫాలుగా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తే వందల కోట్ల అక్రమ సంపాధన బయట పడింది. ఈ పరిణామాల నేపథ్యంలో అక్రమ నిర్మాణాలు, భూ వివాదాలు, అనుమతుల వ్యవహారాలపై కూడా నిఘా సంస్థలు దృష్టి సారించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వెలుగులోకి వస్తున్న వివాదాస్పద నిర్మాణాలు, భూ ఆక్రమణల ఆరోపణల నేపథ్యంలో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ తదితర శాఖల పనితీరుపై సమగ్ర విచారణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అక్రమ నిర్మాణాలకు ఎవరు అనుమతులు ఇచ్చారు? నిబంధనల ఉల్లంఘనలు జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఫిర్యాదులు అందిన తర్వాత కూడా పనులు ఎలా కొనసాగాయి? వంటి అంశాలపై లోతైన దర్యాప్తు జరగాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులకు సంబంధించిన వివాదాస్పద వ్యవహారాల్లో బాధ్యులు ఎవరైనా సరే వాస్తవాలను వెలికితీసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అవినీతికి తావిచ్చే వ్యవస్థలపై నిఘా సంస్థలు దృష్టి సారించి, అక్రమాలకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### రెవెన్యూ శాఖ చేతులెత్తేసింది.. జీహెచ్ఎంసీ తప్పించుకుంది.. హైడ్రా ఎక్కడ..?

రెవెన్యూ శాఖ చేతులెత్తేసింది.. జీహెచ్ఎంసీ తప్పించుకుంది.. మరి హైడ్రా అయినా స్పందిస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు స్థానికుల నుంచి గట్టిగా వినిపిస్తోంది. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రా బాధితులు స్వయంగా ప్రజావాణి లో గంటల తరబడి క్యూలో నిలబడి ఫిర్యాదు చేస్తేనే స్పందిస్తుందా? లేక పక్కా ఆధారాలను, గూగుల్ మాప్స్, రెవెన్యూ రికార్డుల ఆధారంగా పత్రికల్లో ప్రచురించిన కథనాలను, ఎందుకు పరిగనణలోకి తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రెండు, మూడు వందల గజాల పార్కు స్థలాల ఆక్రమణలకే కంచెలు వేసి, బుల్డోజర్లు రంగంలోకి దింపుతున్న హైడ్రా.. నిషేదిత 22(ఎ) జాబితాలో నమోదైన సుమారు 4 వేల చదరపు గజాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా ఎందుకు మౌనం పాటిస్తోందనిస్థానికులు



ప్రభుత్వ భూమని తెలిపే కలెక్టర్ నివేదిక

నిలదీస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, భూ యాజమాన్యంపై స్పష్టత తీసుకువచ్చి, అక్రమాలు నిర్ధారణ అయితే బుల్డోజర్లకు పని చెప్పి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని రక్షణ కోసం కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రభుత్వ భూముల పరిరక్షణ లో హైడ్రా ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న విమర్శలకు మరింత బలం చేకూరే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.















## తెలంగాణలో మొదలైన జాతర జోష్

( మొదటి పేజీ తరువాయి )

మొదటి 'బంగారు బోనం' సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం రూ. 11 లక్షల రూపాయల ప్రభుత్వ చెక్కును ఆలయ కమిటీకి అందజేశారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజుల వీర విన్యాసాలు, డప్పు చప్పుళ్లతో లంగర్ హౌస్ పరిసర ప్రాంతాలన్నీ భక్తి పారవశ్యంతో ఊగిపోయాయి. ఈ వేడుకను కళ్లారా చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆషాఢ బోనాల జాతరకు గోల్కొండ కోట తొలి వేదిక కావడంతో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. నగర నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు ఎక్కడికక్కడ భారీ బందోబస్తును మోహరించారు.



## బీజేపీ అధికారంలోకి వస్తే విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తాం

- కేంద్ర మంత్రి బండి సంజయ్

### సైదాబాద్ సక్సెస్ స్కూల్ పై బండి సీరియస్

**హైదరాబాద్, మహా :** సైదాబాద్‌లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో హిందూ విద్యార్థులకు కల్మా, సురా ఫతేహా చదవాలంటూ హోంవర్క్ ఇచ్చారన్న వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని కల్మా, సూరహ్ ఫతే చదవాలని హుకుం జారీ చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. సక్సెస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ ఘటనపై సెక్యూలర్ సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని తాము అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామన్నారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీడియో

### ఆటో డ్రైవర్ కు భరోసా

ఇటీవల ఆటో డ్రైవర్ భరత్ ను పోలీసులు, మజ్లిస్ నాయకులు వేధింపులకు గురి చేశారని భరత్‌ను వేధించిన పోలీసులు, మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాల్సిందేనని బండి సంజయ్ డిమాండ్ చేశారు. హిందూ సంఘాల నేతలతో కలిసి హైదరాబాద్ లో బండి సంజయ్ ను బాధిత ఆటో డ్రైవర్ కలిశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ భరత్ కు భరోసానిచ్చిన సంజయ్ కొత్త ఆటో కొనిస్తానని మాట ఇచ్చారు. ఇలాంటి ఘటనలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తే తెలంగాణ అంతటా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. భరత్ రాసిన దాంట్లో తప్పేముంది? హిందువులను కించపర్చేలా ఉర్దూలో ఆటోలపై, గోడలపై రాసుకున్న వాళ్లపై ఎందుకు కేసులు పెట్టడం లేదని నిలదీశారు. మజ్లిస్ వాళ్లకో న్యాయం? భరత్ కు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఆటో డ్రైవర్ పై దాడికి దిగిన మజ్లిస్ కార్యకర్తలపై, వేధింపులకు గురి చేసిన పోలీసులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సాగునీటి రంగంలో కొత్త అధ్యాయం

### ఇరిగేషన్ ను బీఆర్ఎస్ భ్రష్టుపట్టించింది - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటితో కలిసి సీతారామ పరిశీలన

**భద్రాద్రి కొత్తగూడెం, మహా.** తెలంగాణలో సాగునీటి రంగానికి కొత్త దిశను నిర్దేశించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల సాగునీటి అవసరాలను తీర్చడం లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. పర్యావరణ, న్యాయ, సాంకేతిక పరమైన అన్ని అడ్డంకులను అధిగమించి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్టు పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే దిశగా సాంకేతిక, పరిపాలనా



ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని వివరించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు విషయంలో గతంలో అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్ధవంతంగా తన వాదనలు వినిపిస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని అనుమతులను చట్టబద్ధంగా పొందిన అనంతరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. చట్టపరమైన ఇబ్బందులు తొలగిన తర్వాత పనులు మరింత వేగంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టుకు అవసరమైన 67 టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్ర జల సంఘం తుది అనుమతి ఇవ్వడం కీలక మైలురాయిగా మంత్రి అభివర్ణించారు. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకుంటాయని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగుభూములకు గోదావరి జలాలు అందించే లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు భూసేకరణ, సాంకేతిక అనుమతులు, పర్యావరణ అనుమతుల ప్రక్రియలను వేగంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.

### కాళేశ్వరం లేకున్నా రికార్డు పంటలు

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణపై కూడా మంత్రి స్పందించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచించిన సాంకేతిక ప్రమాణాల ప్రకారమే కొనసాగుతున్నాయని తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తై భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీల్లో నీటి నిల్వలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణ భద్రత, నిర్మాణాల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని అన్నారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితిపై మాట్లాడిన మంత్రి, కాళేశ్వరం బ్యారేజీల్లో నీటి నిల్వలు లేకపోయినా రైతులు రికార్డు స్థాయిలో పంటలు సాగు చేశారని తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి దాదాపు రూ.19 వేల కోట్లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధాన్యం కొనుగోలు ద్వారా రైతులకు మొత్తం రూ.80 వేల కోట్లకు పైగా నేరుగా చెల్లించినట్లు వెల్లడించారు. నీటిపారుదల శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. శాఖలో వెయ్యికి పైగా ఇంజినీర్ల నియామకం, సుమారు 1,800 మంది ఫీల్డ్ సిబ్బంది భర్తీ, పెండింగ్ పదోన్నతుల మంజూరు వంటి చర్యలతో పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు తెలిపారు. రైతుల శాశ్వత ప్రయోజనాలు, సాగునీటి భద్రత, శాస్త్రీయ ప్రమాణాల అమలే ప్రభుత్వ ప్రాధాన్యమని, రాష్ట్రంలోని ప్రతి సాగునీటి ప్రాజెక్టును నాణ్యతతో పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాగమయి తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్‌లో స్థానిక ఎన్నికలు ఏపీ ప్రభుత్వయోచన

**అమరావతి, మహా :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కూటమి ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఇందుకు అనుగుణంగా యంత్రాంగం కూడా వేగం పెంచింది. తొలుత మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో పోలింగ్ పూర్తి చేయాలని భావిస్తోంది. ఈ ఎన్నికలు ముగిసిన వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో రెండో విడతలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరపాలని యోచిస్తోంది. చివరిగా గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఎన్నికలను సెప్టెంబర్ నెలలోనే నిర్వహించాలని కసరత్తులు చేస్తోంది.

## టీజీ20 సీజన్ విజేత ఈ ఛాంపియన్స్ కు సీఎం అభినందనలు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన టీజీ 20 సీజన్ 1 విజేత హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. ప్లేయర్లతోపాటు ఈ ఛాంపియన్స్ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్‌ను సీఎం రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించారు. అలాగే కోచ్ అనిరుధ్, కెప్టెన్ అభిరథ్ రెడ్డికి సీఎం శాలువా కప్పారు.

సీఎం చేతులమీదుగా చెక్కుల పంపిణీ

ఈ ఛాంపియన్స్ విజయం అనంతరం టీమ్ మేనేజ్‌మెంట్ ఆటగాళ్లకు భారీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. కెప్టెన్‌కు రూ.5 లక్షలు, వైస్ కెప్టెన్‌కు రూ.4 లక్షలు, మిగిలిన ఆటగాళ్లకు రూ.3 లక్షల చొప్పున యాజమాన్యం తరపున ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ ప్రైజ్‌మనీకి సంబంధించిన చెక్కులను గురువారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్లేయర్లకు అందజేశారు.

# హైదరాబాద్ లో డ్రగ్స్ లకలం

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని మంగళహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, హాష్ ఆయిల్ కొనుగోలు చేస్తున్న ముగ్గురు కస్టమర్లను పోలీసులు ఆకస్మిక దాడులు చేసి పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిలో ఒక ప్రముఖ రాజకీయ పార్టీకి చెందిన నేత కుమారుడు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పురానాపూల్ పరిసర ప్రాంతాల్లో మాదక ద్రవ్యాలను కొనుగోలు చేయడానికి మొత్తం ఏడుగురు వ్యక్తులు రాగా, పోలీసుల రాకను గమనించి వారిలో నలుగురు అక్కడికక్కడే పరారయ్యారు. డ్రగ్స్ కొనుగోలు చేయడానికి వచ్చిన వారిలో మాజీ కలెక్టర్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్ రామిరెడ్డి కుమారుడు భరత్ రాజ్ రెడ్డి, అభిషేక్, బొట్టు యూనిత్ అనే ముగ్గురు నిందితులు పట్టుబడగా, వారి నుంచి 24 గ్రాముల హాష్ ఆయిల్ సాచెట్లు, 22 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ వ్యవహారంలో సోనీ, వంశీ, మనోజ్, తుల్జాసింగ్ అనే మరో నలుగురు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పట్టుబడిన భరత్‌రాజ్ రెడ్డి, అభిషేక్, బొట్టు యూనిత్‌లను వైద్య పరీక్షల అనంతరం పోలీసులు తదుపరి చర్యల కోసం రిహాబిలిటేషన్ సెంటర్ కు తరలించారు. ఈ ఘటనపై మంగళహాట్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు

### .బ్లడ్ శాంపిల్స్ సేకరణ.. ఉస్మానియాకు తరలింపు

పోలీసులు నిందితులందరినీ అక్కడికక్కడే అదుపులోకి తీసుకుని మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితులు మాదకద్రవ్యాలు సేవించారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకోవడానికి పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు. స్టేషన్‌లోనే వారి నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించారు. ఆ తర్వాత మరింత లోతైన వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితులను ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసు అత్యంత సున్నితమైనది కావడం, రాజకీయ ప్రముఖుల పేర్లు బయటకు రావడం వల్ల పోలీసులు ప్రస్తుతం చాలా గోప్యతను పాటిస్తున్నారు. పట్టుబడిన ఎమ్మెల్సీ కుమారుడు భరత్ మినహా, మిగిలిన ముగ్గురు నిందితుల పూర్తి వివరాలను వారి నుంచి ఎంత పరిమాణంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారనే విషయాలను అధికారికంగా వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు. ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న ప్రధాన నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు.

# జులై 20 నుంచి పార్లమెంట్ వర్షా కాల సమావేశాలు.

**ఢిల్లీ, మహా :** జులై 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం విస్తృత అజెండాతో సిద్ధమైంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు నుంచి ఆదాయపు పన్ను చట్ట సవరణలు, విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలో మార్పులు, ఎంఎస్ఎంఈలకు ఊతమిచ్చే కొత్త నిబంధనల వరకు మొత్తం ఐదు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. ఆగస్టు 13 వరకు కొనసాగే ఈ సమావేశాలు రాజకీయంగా, శాసనపరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### విడుదలైన బిజినెస్ లిస్ట్

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో చేపట్టనున్న శాసన కార్యక్రమాల జాబితాను పార్లమెంట్ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ విడుదల చేశారు. ప్రభుత్వం ఈ సమావేశాల్లో ఐదు కొత్త బిల్లులను ప్రవేశపెట్టడంతో పాటు పలు కీలక చట్ట సవరణలను చేపట్టనుంది. దేశ ఆర్థిక, న్యాయ, పరిపాలనా వ్యవస్థలకు సంబంధించిన అనేక అంశాలపై ఈ సమావేశాల్లో చర్చలు జరగనున్నాయి.

### సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు

దేశ అత్యున్నత న్యాయస్థానంలో పెరుగుతున్న కేసుల భారం దృష్ట్యా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 33 నుంచి 37కు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ బిల్లును తీసుకురానుంది. ఈ నిర్ణయం ద్వారా పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయడం, న్యాయ వ్యవస్థ సామర్థ్యాన్ని మరింత పెంచడం ప్రభుత్వ లక్ష్యంగా పేర్కొంటోంది.

### ఆదాయపు పన్ను, విదేశీ విరాళాల చట్టాల్లో మార్పులు

ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న ఆర్థిక ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని ఆదాయపు పన్ను చట్టంలో పలు కీలక మార్పులు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లును కూడా ఈ సమావేశాల్లో చర్చించి ఆమోదించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మార్పులు ఆర్థిక పారదర్శకత, నియంత్రణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నాయి. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' బిల్లుపై కూడా ఈ సమావేశాల్లో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదేవిధంగా జనన, మరణాల ఆలస్య నమోదుకు సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేసే సవరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టంలోనూ కొన్ని కీలక మార్పులు ప్రతిపాదించనుంది.

### ఎంఎస్ఎంఈలకు కొత్త ఊతం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఎంఎస్ఎంఈ రంగంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే బిల్లులను కేంద్ర ప్రభుత్వం తీసుకురానుంది. ముఖ్యంగా చెల్లింపుల జాప్యాన్ని తగ్గించడం, వివాదాల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, రాష్ట్రాలు స్వయంగా ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణలు చేయడం ఈ బిల్లుల ప్రధాన ఉద్దేశంగా ఉంది. ఈ సమావేశాల్లో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అదనపు వ్యయాలకు అనుమతి కోరుతూ అదనపు నిధుల ప్రతిపాదనపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యయాలకు సంబంధించిన పలు ఆర్థిక అంశాలు కూడా పార్లమెంట్ ముందుకు రానున్నాయి.



## రైతులను ఇబ్బంది పెడితే ప్రభుత్వం బాగుపడదు..

**కొనసాగుతున్న రైతు రిలే దీక్షలు...**

**రాజేంద్రనగర్ మహా ;** ప్రాణాలైనా అర్పిస్తాం సాగు భూములను వదలమంటూ బహదూర్ గూడా రైతుల రిలే దీక్షలు గురువారం కొనసాగాయి.శంషాబాద్ సర్కిల్ పరిధిలోని బహదూర్ గూడలో తాతల తండ్రుల కాలం నుంచిసాగు భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. ఆ సాగు భూములను వదులుకునే ప్రసక్తి లేదని గ్రామ రైతులు పేర్కొన్నారు. తమకు అన్యాయం జరుగుతే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.పట్టా భూముల, ప్రభుత్వ భూముల ముందు నిర్ధారించిన తర్వాతే పంచాయతీ ముందుకు సాగుతుందన్నారు. 1350 ఎకరాల భూములకు ముందుగా పట్టాలు ఇవ్వాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం బాగుపడదని రైతులు మండి పడ్డారు.



## టీజీ20 సీజన్ విజేత ఈ ఛాంపియన్స్ కు సీఎం అభినందనలు

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన టీజీ 20 సీజన్ 1 విజేత హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ జట్టు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసింది. ప్లేయర్లతోపాటు ఈ ఛాంపియన్స్ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్, ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి, దివిజ, ఉషోదయా ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ సాంబశివరావు, ఈటీవీ ఎండీ బాపినీడు సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ కిరణ్‌ను సీఎం రేవంత్ రెడ్డి శాలువాతో సత్కరించారు. అలాగే కోచ్ అనిరుధ్, కెప్టెన్ అభిరథ్ రెడ్డికి సీఎం శాలువా కప్పారు.

**సీఎం చేతులమీదుగా చెక్కుల పంపిణీ**

ఈ ఛాంపియన్స్ విజయం అనంతరం టీమ్ మేనేజ్‌మెంట్ ఆటగాళ్లకు భారీ ప్రైజ్‌మనీ ప్రకటించింది. కెప్టెన్‌కు రూ.5 లక్షలు, వైస్ కెప్టెన్‌కు రూ.4 లక్షలు, మిగిలిన ఆటగాళ్లకు రూ.3 లక్షల చొప్పున యాజమాన్యం తరఫున ప్రోత్సాహకంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ ప్రైజ్‌మనీకి సంబంధించిన చెక్కులను గురువారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్లేయర్లకు అందజేశారు.

## తాగునీటి సరఫరాకు తొలి ప్రాధాన్యం

**అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు.**

**హైదరాబాద్, మహా.:** రాష్ట్రంలో తాగునీటి సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా అత్యంత ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా అధికారులను ఆదేశించారు. తాగునీరు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, విద్యాశాఖ, సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై గురువారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తాగునీటి సరఫరా అత్యంత ప్రాధాన్య అంశమని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని నీటి ప్రాజెక్టుల్లో తాగునీటికి అవసరమైన నీటి మట్టాలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో అమృత్ పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

వీబీజీఆర్‌ఏఎంజీ కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఎస్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో పడే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగవంతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

# గజమాలలు, పాలాభిషేకాలపై నిషేధం

- టీపీసీసీ సంచలన సర్క్యులర్
- భజన సంస్కృతి బంద్



**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో భజన సంస్కృతికి, ఆడంబరాలకు అడ్డుకట్ట వేసేలా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఒక చారిత్రాత్మక , సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ కార్యక్రమాల్లో నేతలకు పాలాభిషేకాలు చేయడం, జేసీబీలు, బుల్డోజర్ల వంటి భారీ యంత్రాలను ఉపయోగించి భారీ గజమాలలు వేయడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఒక అధికారిక సర్క్యులర్ జారీ చేసింది. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి వస్తాయని, ప్రతి ఒక్కరూ దీనిని ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంతకంతో విడుదలైన ఈ సర్క్యులర్ లేఖ ప్రకారం.. తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, నైతిక విలువల ప్రకారం ఆహార పదార్థాలను వృధా చేయడం సరైన పద్ధతి కాదని, అందుకే పార్టీ నిర్వహించే ఏ చిన్న లేదా పెద్ద కార్యక్రమాల్లోనైనా, ఏ వేదికపైనైనా సరే పాలతో అభిషేకాలు , నీటితో అభిషేకాలు చేయడాన్ని ఖచ్చితంగా నిలిపివేయాలని ఆదేశించారు. సమాజంలో ఎంతో మంది పోషకాహార లోపం ఎదుర్కొంటున్న తరుణంలో, ఇలా పాలను వృధా చేయడం భావ్యం కాదని టీపీసీసీ ఈ లేఖలో తీవ్రంగా ఆక్షేపించింది. పాలాభిషేకాలు వంటి వృధా పనులకు బదులుగా, పేదలకు, అవసరమున్న వారికి ఆహార పదార్థాలను పంపిణీ చేసే సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేసింది. దీనివల్ల సమాజానికి మేలు జరగడమే కాకుండా పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతుందని అభిప్రాయపడింది. ఇక ఇటీవల కాలంలో రాజకీయ సభల్లో పెచ్చుమీరిపోయిన జేసీబీ సంస్కృతిపై కూడా కాంగ్రెస్ పార్టీ ఉక్కుపాదం మోపింది. సీనియర్ నేతలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించే సమయంలో కొందరు నాయకులు తమ అతి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ జేసీబీలు, బుల్డోజర్లు, ఇతర భారీ యంత్రాలను ఉపయోగించి భారీ దండలు వేస్తున్నట్లు పార్టీ గుర్తించింది. బుల్డోజర్లు, జేసీబీలు వంటి వాహనాలు అణచివేతకు చిహ్నాలని, అందుకే అలాంటి వాటిని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించదని స్పష్టం చేస్తూ.. ఈ తరహా ప్రదర్శనలను పూర్తిగా నిషేధించింది.ఒకవేళ ఈ ఆదేశాలను ధిక్కరించి ఎవరైనా నేతలకు జేసీబీలు, క్రేన్ల ద్వారా గజమాలలు వేయడానికి ప్రయత్నిస్తే, సదరు నాయకులు, కార్యకర్తలపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని టీపీసీసీ గట్టిగా హెచ్చరించింది. ఈ సర్క్యులర్ కాపీలను రాష్ట్రంలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పీసీసీ అనుబంధ విభాగాలు, సెల్స్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులందరికీ పంపిస్తూ, క్షేత్రస్థాయిలో ఈ నియమాలు ఖచ్చితంగా అమలు అయ్యేలా చూడాలని ఆదేశించింది.

## నిరసనలపై నిషేధం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- జెన్‌కో సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి

**: దేవీప్రసాద్,**




**కుషాయిగూడ, మహా :** జెన్‌కో యాజమాన్యం ఉద్యోగులు, ఇంజనీర్లు శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, నినాదాలపై నిషేధం విధిస్తూ జారీ చేసిన సర్క్యులర్ తీవ్ర ఆందోళన కలిగిస్తోందని టీఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు గుండవరం దేవీప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఉద్యోగుల రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్య విలువలను అవమానించే చర్యగా భావిస్తున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన రాష్ట్రంలో ఉద్యోగుల గొంతును నొక్కే ప్రయత్నం అత్యంత దురదృష్టకరమన్నారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన యాజమాన్యం బెదిరింపులు, క్రమశిక్షణ చర్యల పేరుతో ఉద్యోగులను భయపెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కూడా ఇలాంటి ఉత్తర్వులు వెలువడలేదని గుర్తు చేశారు.

ఇటీవల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యాష్ హ్యాండ్లింగ్, కోల్ హ్యాండ్లింగ్ పనులను ప్రైవేటీకరించే టెండర్లపై ఉద్యోగులు, ఇంజనీర్లు వ్యక్తం చేస్తున్న ఆందోళనల నేపథ్యంలోనే ఈ నిషేధ ఉత్తర్వులు రావడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను దశలవారీగా ప్రైవేటీకరించే ప్రయత్నాలను వ్యతిరేకించే స్వరాలను అణచివేయడానికే ఈ చర్యలు చేపట్టారా అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ రంగాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలబెట్టింది ఉద్యోగులు, ఇంజనీర్లేనని, అలాంటి వారిని నేరస్థుల్లా చూస్తూ నిరసన తెలిపితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం అన్యాయమన్నారు. విద్యుత్ సంస్థల్లో కొనసాగుతున్న ఆంధ్రా అధికారుల పెత్తనం కారణంగానే తెలంగాణ ఉద్యోగులపై వివక్షపూరిత ధోరణి కొనసాగుతోందన్న ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే జూలై 16న జారీ చేసిన నిరసనల నిషేధ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ టెండర్లను రద్దు చేయాలని, విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి వారి అభిప్రాయాలను గౌరవించాలని, ఉద్యోగులపై బెదిరింపులు, క్రమశిక్షణ చర్యల హెచ్చరికలను వెంటనే నిలిపివేయాలని కోరారు. విద్యుత్ సంస్థలు తెలంగాణ ప్రజల ఆస్తి అని, వాటిని కాపాడాలని కోరుతున్న ఉద్యోగుల గొంతును అణచివేయడం కాకుండా వారి ఆందోళనలను ఆలకించి పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు, విద్యుత్ ఉద్యోగులు ప్రజారంగ పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1లో అదనపు కోచ్‌ల ఏర్పాటు.

**హైదరాబాద్, మహా.** రద్దీ స్టేషన్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిహైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) శుభవార్త అందించింది. నగరంలో మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీని తగ్గించేందుకు ఫేజ్ 1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉండే స్టేషన్లలో ప్రయాణికులకు వెసులుబాటు కల్పించేలా ఈ చర్యలు చేపట్టింది.ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర ఉన్న ఫేజ్ 1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఈ కోచ్‌లు సరిపోవడం లేదు. అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి కీలక స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో, కొత్త కోచ్‌ల కొనుగోలు నిమిత్తం తయారీదారులతో వెంటనే చర్చలు ప్రారంభించాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు.ప్రయాణికుల సేవలు, మౌలిక వసతులపై జరిపిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. కోచ్‌ల పెంపుతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై అధికారులు దృష్టి సారించారు. ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే, పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, మెట్రో స్టేషన్లకు అనుసంధానంగా ఉన్న స్కైవాక్‌ల నిర్వహణ, రద్దీ నియంత్రణకు వినూత్న వ్యూహాలను అమలు చేయాలని నిర్ణయించారు.

# అమెరికా గ్రీన్ కార్డుపై కొత్త ప్రతిపాదన

- దరఖాస్తుదారుల నుంచి లక్ష డాలర్ల వరకు రీఫండబుల్ బాండ్‌కు యోచన.
- భారతీయులపై ప్రభావం ఉండొచ్చన్న అంచనా.



**ఢిల్లీ, మహా :** అమెరికాలో శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డు) పొందాలనుకునే విదేశీయులకు మరో కీలక మార్పు చోటు చేసుకుంటున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిపాలన పరిశీలిస్తున్న కొత్త ప్రతిపాదన ప్రకారం, విదేశాల నుంచి గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే కొందరు అభ్యర్థులు గరిష్ఠంగా ఒక లక్ష అమెరికన్ డాలర్లు వరకు రీఫండబుల్ బాండ్ (తిరిగి చెల్లించే డిపాజిట్) జమ చేయాల్సి రావచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఇప్పటికే సుదీర్ఘంగా, క్లిష్టంగా ఉన్న అమెరికా వలస ప్రక్రియలో మరో ఆర్థిక అడ్డంకి చేరే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం అమెరికా విదేశాంగ శాఖ పరిశీలిస్తున్న పైలట్ కార్యక్రమం ప్రకారం, విదేశాల్లోని అమెరికా కాన్సులేట్‌ల ద్వారా ఇమ్మిగ్రెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునే ఎంపిక చేసిన అభ్యర్థుల నుంచి ముందుగా బాండ్ రూపంలో డిపాజిట్ తీసుకునే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ బాండ్ మొత్తం గరిష్ఠంగా ఒక లక్ష అమెరికన్ డాలర్ల వరకు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. మొదట ఈ విధానాన్ని కొద్ది దేశాల్లో మాత్రమే ప్రయోగాత్మకంగా అమలు చేసి, అనంతరం ఫలితాలను సమీక్షించిన తర్వాత విస్తరణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం.

ప్రతిపాదన ప్రకారం దరఖాస్తుదారుల తరఫున అమెరికాలో నివసిస్తున్న కుటుంబ సభ్యులు లేదా స్పాన్సర్లు కూడా బాండ్ మొత్తాన్ని చెల్లించే అవకాశం ఉంటుంది. దరఖాస్తుదారు అనంతరం అమెరికా పౌరసత్వం పొందిన తర్వాత ఈ డిపాజిట్‌ను తిరిగి చెల్లించే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కార్యక్రమంలో ఏ దేశాలను చేర్చుతారు, ఏ వర్గాల అభ్యర్థులకు ఇది వర్తిస్తుంది, తుది బాండ్ మొత్తం ఎంత ఉంటుందనే అంశాలపై ఇప్పటివరకు అమెరికా ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.ఈ ప్రతిపాదన అమలైతే భారతీయులపై కూడా గణనీయమైన ప్రభావం ఉండే అవకాశం ఉందని వలస నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే భారతీయులు ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక నిరీక్షణను ఎదుర్కొంటున్నారు. సమాచార సాంకేతిక, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో పనిచేస్తున్న వేలాది మంది భారతీయులు ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డు కోసం సంవత్సరాలుగా వేచి చూస్తున్నారు.

అమెరికా వలస చట్టాల ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరంలో జారీ చేసే ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డుల్లో ఒక్కో దేశానికి గరిష్ఠంగా ఏడు శాతం మాత్రమే కేటాయించవచ్చు. ప్రతి ఏడాది సుమారు లక్షా నలభై వేల ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డులు జారీ చేసినప్పటికీ, ఒక్కో దేశానికి సుమారు 9,800 కార్డులు మాత్రమే అందుబాటులో ఉండటంతో భారతీయుల కోసం భారీ పెండింగ్ జాబితా ఏర్పడింది. వివిధ అంచనాల ప్రకారం ప్రధాన దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యులు కలిపి పది లక్షలకు పైగా భారతీయులు ప్రస్తుతం ఉద్యోగ ఆధారిత గ్రీన్ కార్డు కోసం నిరీక్షిస్తున్నారు. వీరిలో చాలామందికి గ్రీన్ కార్డు పొందేందుకు దశాబ్దాల సమయం పట్టే పరిస్థితి కొనసాగుతోంది.

అయితే ప్రస్తుతం ఈ బాండ్ విధానం కేవలం ప్రతిపాదన దశలో మాత్రమే ఉందని గుర్తుంచుకోవాలి. దీనిపై ఇంకా అధికారిక నిర్ణయం వెలువడలేదు. పైలట్ కార్యక్రమం అమలు, దాని ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలపై అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయం తీసుకోనుంది. అయినప్పటికీ ఈ ప్రతిపాదన అమెరికా వలస విధానంలో మరో కీలక మార్పుకు సంకేతంగా మారింది. ముఖ్యంగా అమెరికాలో శాశ్వతంగా స్థిరపడాలని ఆశిస్తున్న భారతీయులతో పాటు ఇతర దేశాల అభ్యర్థులు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నారు.



## వైభవంగా జగన్నాథుని రథయాత్ర...

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామనగర్ లోని సమతామూర్తి కేంద్రంలో గురువారం శ్రీ జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్నజీయర్ స్వామిపర్యవేక్షణలోశ్రీ జగన్నాథుని రథయాత్రలో భక్తులు భక్తిశ్రద్ధలతో కీర్తనలు, ఆధ్యాత్మిక సంబరాల నడుమ స్వామివారి పవిత్ర రథోత్సవం వేడుకలు జరిగాయి.లోకకల్యాణార్థం జరిగే ఈ పవిత్రమైన రథయాత్రలో పాల్గొని, జగన్నాథ స్వామివారి దివ్య ఆశీస్సులు అందుకోవాలని, రథాన్ని లాగే అరుదైన భాగ్యాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వహకులు తెలిపారు.భక్తులందరూ తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ దివ్య రథయాత్రలో పాల్గొని, స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలన్నారు.

# మూడు వ్యవసాయ జోన్లు

**8 పంటలకు శాస్త్రీయ సాగు మార్గదర్శకాలు విడుదల.**

**హైదరాబాద్, మహా :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు ప్రారంభించింది. రైతులు వర్షాభావ పరిస్థితుల్లో నష్టపోకుండా రాష్ట్రస్థాయి ఎల్‌నినో కంటింజెన్సీ ప్లాన్2026ను రూపొందించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యాచరణ ప్రణాళికను విడుదల చేస్తూ, వాతావరణ మార్పులకు అనుగుణంగా శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ ప్రణాళికలో భాగంగా తెలంగాణను మూడు వ్యవసాయ జోన్లుగా విభజించి, ఆయా ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, వర్షపాతం అంచనాలు, నేల స్వభావానికి అనుగుణంగా సాగు మార్గదర్శకాలను రూపొందించారు. రాష్ట్రంలోని 18 ప్రధాన పంటలకు సంబంధించి విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై సమగ్ర సూచనలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా, మండలాల వారీగా వర్షపాతం అంచనాలతో పాటు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే ప్రత్యేక కార్యాచరణను కూడా సిద్ధం చేశారు.భూగర్భ జలాలు, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వల వివరాలను రైతులకు రోజువారీగా అందించాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బోర్‌వెల్స్‌పై ఆధారపడి వరి సాగు చేయవద్దని సూచించిన ఆయన, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, ఉద్యాన పంటల వైపు రైతులు మళ్లాలని కోరారు. నీటి వినియోగంలో పొదుపు పాటిస్తూ పరిస్థితులకు అనుగుణంగా సాగు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు శాస్త్రీయ సలహాలు అందించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదే సమయంలో భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు పరిమితంగానే ఉండటంతో సంప్రదాయ సాగు విధానాల కంటే వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

# రాజకీయ కక్షతో కేసులు పెట్టారు

**ప్రజాస్వామ్యానికి ముప్పని ఏపీ హైకోర్టు వ్యాఖ్యలు**



**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అసైన్డ్ భూముల వ్యవహారంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి పి. నారాయణపై వైసీపీ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులు రాజకీయ కక్షసాధింపులో భాగంగానే నమోదు చేసినవిగా కనిపిస్తున్నాయని హైకోర్టు స్పష్టం చేసింది. పరిపాలనా నిర్ణయాలకు నేరపూరిత ఉద్దేశాలను ఆపాదించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని న్యాయస్థానం వ్యాఖ్యానించింది.తీర్పులో భాగంగా, చట్ట నిబంధనలకు అనుగుణంగానే జీవో నంబర్ 141 జారీ చేసినట్లు హైకోర్టు పేర్కొంది. ఆ జీవో వల్ల తమకు నష్టం జరిగిందంటూ ఏ రైతు కూడా కోర్టును ఆశ్రయించలేదని గమనించింది. ఏపీ సీఆర్డీఏ చట్టం ప్రకారం తీసుకున్న పరిపాలనా నిర్ణయాలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని స్పష్టం చేసింది.సీఆర్డీఏ చట్టంలోని సెక్షన్ 146 ప్రకారం ఇలాంటి నిర్ణయాలపై ప్రాసిక్యూషన్‌కు చట్టపరమైన పరిమితులు ఉన్నాయని హైకోర్టు పేర్కొంది. అయినప్పటికీ చంద్రబాబు నాయుడు, పి. నారాయణలను యాంత్రికంగా, దౌర్జన్యపూరితంగా నిందితుల జాబితాలో చేర్చినట్లు వ్యాఖ్యానించింది.ఈ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదులో ప్రజాప్రయోజనం కంటే దురుద్దేశమే కనిపిస్తోందని హైకోర్టు అభిప్రాయపడింది. పిటిషనర్లపై చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని, అవన్నీ నిరాధారమైనవేనని తేల్చిచెప్పింది. దీంతో చంద్రబాబు నాయుడు, పి. నారాయణపై నమోదైన కేసులను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది.వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని పరిధిలోని అసైన్డ్ భూముల వ్యవహారానికి సంబంధించి చంద్రబాబు నాయుడు, పి. నారాయణలపై ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేయగా, తాజాగా హైకోర్టు వాటిని రద్దు చేస్తూ కీలక తీర్పు ఇచ్చింది.

# గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి దిశగా కీలక అడుగు

*** పంచాయతీల సొంత ఆదాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి.**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వయంప్రతిపత్తి కల్పిస్తూ, వాటి సొంత ఆదాయంపై పూర్తి నియంత్రణ ఇచ్చేలా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లో సవరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రతిపాదనకు శుక్రవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. చట్ట సవరణ అమల్లోకి వస్తే గ్రామ పంచాయతీల ఆర్థిక నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.ప్రతిపాదిత సవరణ ప్రకారం పంచాయతీరాజ్ చట్టంలోని 70(3) సెక్షన్‌ను సవరించనున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీ ద్వారా నిర్వహించే విధానం అమల్లో ఉండగా, ఇకపై ఆ నిధులను నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. క్యాబినెట్ ఆమోదం అనంతరం ఈ మార్పును వెంటనే అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశమూ ఉందని సమాచారం.ఈ సవరణ అమల్లోకి వస్తే గ్రామాల్లో ఆస్తి పన్ను, వ్యాపార లైసెన్స్ రుసుములు, వివిధ సేవల ఫీజులు, ఇతర స్థానిక వనరుల ద్వారా వచ్చే ఆదాయం నేరుగా గ్రామ పంచాయతీల ఆధీనంలోకి వస్తుంది. దీంతో తమ అవసరాలకు సంబంధించిన నిధుల కోసం ప్రభుత్వ ట్రెజరీ ప్రక్రియపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. స్థానికంగా వసూలైన నిధులను గ్రామాభివృద్ధి అవసరాలకు తక్షణమే వినియోగించే అవకాశం లభించనుంది.నిధుల వినియోగంలో జాప్యం తగ్గడంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, చిన్నపాటి మౌలిక వసతుల పనులు, అత్యవసర మరమ్మతులు వంటి అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా చేపట్టేందుకు గ్రామ పంచాయతీలకు అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. గ్రామస్థాయిలోనే ఆర్థిక నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ పెరగడం ద్వారా స్థానిక పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

స్థానిక సంస్థలకు ఆర్థిక వికేంద్రీకరణ కల్పించడం ద్వారా గ్రామ స్వయం పాలనను బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయ వినియోగంపై మరింత స్వేచ్ఛ కల్పించడం వల్ల అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కూడా గణనీయమైన మార్పు కనిపించే అవకాశం ఉందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఢిల్లీ పీఠంపై మోదీ అప్రతిహత చాణక్యం



భారతదేశ సార్వభౌమత్వ పటిమను, ప్రజాస్వామ్య వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా సమున్నతంగా చాటిచెప్పే మరో మహా ఘట్టానికి దేశ రాజధాని ఢిల్లీ నగరం వేదిక కాబోతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు కేవలం ఒక సాధారణ చట్టసభల సమావేశాలు కావు; ఇవి నవభారత భవిష్యత్తును, దేశ రాజకీయ ప్రాతినిధ్యాన్ని సరికొత్తగా నిర్వచించే చారిత్రక సంస్కరణలకు నాంది పలకనున్నాయి. దేశ శ్రేయస్సును, మహిళా సాధికారతను కాంక్షిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణల ఆమోదానికి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ అత్యంత వ్యూహాత్మకంగా, అత్యంత సమర్థవంతంగా అడుగులు వేస్తోంది. గత ఏప్రిల్ నెలలో కేవలం సంఖ్యాబల కొరతతో సాంకేతికంగా ఆగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ఈసారి ఎలాగైనా గట్టెక్కించి, దేశానికి ఒకే దేశంఒకే ఎన్నికల విధానం కింద నూతన దిశానిర్దేశం చేయాలని కేంద్ర పాలకులు సంకల్పించారు. కేవలం మూడు నెలల స్వల్ప కాల వ్యవధిలోనే దేశ రాజకీయ ముఖచిత్రాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ చూపిన అసాధారణ చాణక్య నీతి, రాజకీయ చదరంగ వ్యూహాలు ఇప్పుడు రాజకీయ విశ్లేషకులను సైతం విస్మయానికి గురిచేస్తున్నాయి.

**మూడు నెలల్లోనే తలకిందులైన విపక్షాల సమీకరణాలు****

రాజకీయాల్లో వ్యూహాత్మక పటిమ, దేశాభివృద్ధి పట్ల స్పష్టమైన దార్శనికత ఉంటే ఎలాంటి అసాధ్యాలనైనా సుసాధ్యం చేయవచ్చని కేంద్రంలోని బీజేపీ అగ్రనాయకత్వం మరోసారి నిరూపించింది. ఏప్రిల్ నెలలో బిల్లు ఆమోదం పొందకపోవడంతో సంబరాలు చేసుకున్న విపక్షాల ఆనందం కేవలం మూడు నెలల్లోనే ఆవిరైపోయింది. గడిచిన ఈ స్వల్ప కాలంలో సార్వత్రిక ఎన్నికలు జరగకపోయినప్పటికీ, అంతర్గతంగా చోటుచేసుకున్న రాజకీయ పునరేకీకరణలు ఎన్డీయే కూటమిని శత్రు దుర్భేద్యంగా మార్చాయి. జాతీయ ప్రయోజనాలే పరమావధిగా సాగుతున్న మోదీ ప్రభుత్వ పరిపాలనకు ఆకర్షితులై, వివిధ ప్రాంతీయ పార్టీలలోని ప్రగతిశీల శక్తులు జాతీయ స్రవంతిలో భాగస్వామ్యమవడానికి మొగ్గు చూపాయి. విపక్షాల సంకుచిత రాజకీయాలను నిరసిస్తూ, దేశ సమగ్రత కోసం కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా నిలిచేందుకు పలువురు పార్లమెంటు సభ్యులు ముందుకు రావడం మోదీ నాయకత్వ వైశిష్ట్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పరిణామాలు లోక్‌సభలో అధికార కూటమి బలాన్ని గణనీయంగా పెంచడమే కాకుండా, ప్రతిపక్షాల నైతిక స్థైర్యాన్ని, వారి వ్యూహాత్మక అడ్డంకులను పూర్తిగా పటాపంచలు చేశాయి.

**తృణమూల్, శివసేన వర్గాల్లో అనూహ్య విచ్ఛిన్నం**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలంగా ఏకఛత్రాధిపత్యం చలాయిస్తున్న తృణమూల్ కాంగ్రెస్‌లో సంభవించిన మహా చీలిక కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక విజయానికి ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. ఆ పార్టీకి చెందిన 20 మంది అసమ్మతి పార్లమెంటు సభ్యులు మమతా బెనర్జీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తిరుగుబావుటా ఎగురవేసి, 'నేషనలిస్ట్ సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియా' పేరిట సరికొత్త జాతీయ భావజాల సంస్థను ఏర్పాటు చేయడం దేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఈ 20 మంది ఎంపీలు దేశ ప్రగతి కోసం ఎన్డీయే కూటమికి బేషరతుగా తమ మద్దతును ప్రకటించడం మోదీ ప్రభుత్వానికి కొండంత అండగా మారింది.

ఈ సంచలనానికి తోడు మహారాష్ట్ర రాజకీయాల్లోనూ ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన వర్గానికి పెద్ద షాక్ తగిలింది. ఆ వర్గానికి చెందిన ఆరుగురు కీలక లోక్‌సభ సభ్యులు జాతీయ ప్రయోజనాలే మిన్న అని భావించి, ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే సారథ్యంలోని అధికారిక శివసేనలో విలీనమయ్యారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాకముందే స్పీకర్ అధికారికంగా ఈ మార్పులను గుర్తిస్తే, లోక్‌సభలో ట్రెజరీ బెంచీల వైపు బలగాల మోహరింపు మరింత పటిష్టంగా మారనుంది. విపక్షాల కోటలుగా భావించిన ప్రాంతాల నుంచే ఈ తరహా మద్దతు లభించడం బీజేపీ అగ్రనాయకత్వం సాధించిన అద్భుత దౌత్య విజయంగా అభివర్ణించవచ్చు.

**విచ్ఛిన్నమైన దశాబ్దాల కాంగ్రెస్-డీఎంకే కూటమి**

దక్షిణాది రాజకీయాల్లో, ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రంలో దశాబ్ద కాలానికి పైగా అత్యంత పటిష్టంగా మరియు అజేయంగా కొనసాగుతూ వచ్చిన కాంగ్రెస్‌డీఎంకే కూటమి విచ్ఛిన్నం కావడం ప్రస్తుత జాతీయ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. ప్రాంతీయ సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల తీవ్ర అసంతృప్తికి గురైన ద్రవిడ మున్నేట్ర కజగం , విపక్షాల సారథ్యంలోని 'ఇండి' కూటమి నుంచి శాశ్వతంగా వైదొలగడం ఆ కూటమి ఐక్యతపై చావుదెబ్బ కొట్టింది. డీఎంకే అధికారికంగా ఎన్డీయే కూటమిలో చేరనప్పటికీ, దేశ ప్రయోజనాలకు అత్యంత కీలకమైన మరియు చారిత్రాత్మకమైన సంస్కరణల బిల్లులపై మోదీ ప్రభుత్వానికి అంశాల వారీగా మద్దతు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయడం గమనార్హం. డీఎంకేకు చెందిన 22 మంది లోక్‌సభ సభ్యుల మద్దతును వ్యూహాత్మకంగా సాధించడం ద్వారా, సభలో ప్రతిపక్షాల సంఖ్యాబలాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడంలో కేంద్ర ప్రభుత్వం అఖండ విజయాన్ని సాధించింది. ప్రాంతీయ పార్టీలను కూడా జాతీయ వికాసంలో భాగస్వాములను చేయగల సామర్థ్యం కేవలం నరేంద్ర మోదీ నాయకత్వానికే సాధ్యమని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

**ప్రత్యేక మెజారిటీ సాధన దిశగా అజేయ ప్రయాణం**

భారత రాజ్యాంగ నిబంధనల ప్రకారం 131వ రాజ్యాంగ సవరణ వంటి మహోన్నత చట్టాలను తీసుకురావడానికి సాధారణ సంఖ్యాబలం సరిపోదు. సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో సగానికి పైగా మద్దతు ఉండటంతో పాటు, ఓటింగ్‌లో పాల్గొనే సభ్యులలో కనీసం మూడింట రెండు వంతుల మంది ఆమోదం తెలపాలనే కఠినమైన రాజ్యాంగ నియమం ఉంది. గత ఏప్రిల్ నెలలో జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు రావడం వల్ల కేవలం 54 ఓట్ల స్వల్ప తేడాతో చారిత్రక అవకాశం చేజారింది. అయితే, ప్రస్తుత రాజకీయ పునరేకీకరణ ఆ లోటును పూర్తిగా భర్తీ చేయడమే కాకుండా, ఎన్డీయేను తిరుగులేని శక్తిగా నిలబెట్టింది.

ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయేకు ఉన్న సొంత బలం 293 కాగా, కొత్తగా జతకూడిన ఎన్‌సీపీఐ విలీన ఎంపీలు మరియు షిండే శివసేన ఎంపీల మద్దతుతో ఈ సంఖ్య 319 మార్కుకు చేరుకుంటుంది. దీనికి తోడు దేశాభివృద్ధిని కాంక్షిస్తూ డీఎంకేకు చెందిన 22 మంది ఎంపీలు అంశాల వారీగా మద్దతు పలికితే ఎన్డీయే సంఖ్యాబలం అప్రతిహతంగా 341కి పెరుగుతుంది. దురదృష్టవశాత్తు కొందరు ఎంపీల మరణాల వల్ల సభలో ప్రస్తుతం మూడు స్థానాలు ఖాళీగా ఉండటం వల్ల, మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ కూడా స్వల్పంగా తగ్గింది. ఈ అనుకూల అంశాలన్నీ మోదీ చాణక్య వ్యూహానికి బలాన్ని చేకూరుస్తుండటంతో, విపక్షాల గైర్హాజరీ లేదా వాకౌట్ల వ్యూహాలు కూడా కేంద్ర ప్రభుత్వ విజయ యాత్రను అడ్డుకోలేవని స్పష్టమవుతోంది.

**నవభారత సార్వభౌమత్వానికి నూతన దిశానిర్దేశం**

నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం అనేది కేవలం ఒక చట్టసభ ప్రక్రియ మాత్రమే కాదు; ఇది భారతదేశ ప్రజాస్వామ్య పునాదులను రాబోయే శతాబ్దాల కాలం పాటు మరింత పటిష్టం చేసే ఒక మహోన్నత చారిత్రక సంస్కరణ. ఇలాంటి దేశహిత సంస్కరణలను కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవాలని చూసిన విపక్షాల కుయుక్తులను పటాపంచలు చేస్తూ, ప్రజాస్వామ్య అత్యున్నత వేదికపై విజయం సాధించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సర్వసన్నద్ధమైంది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న ఈ వర్షాకాల సమావేశాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చడమే కాకుండా, సగర్వ నవభారత నిర్మాణంలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ మైలురాయిగా నిలిచిపోనున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

**(గడల నరసింహారావు సీనియర్ జర్నలిస్ట్)**



## వృద్ధ ఖైదీల విడుదలపై సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు

*** మూడు నెలల్లో ఏకరీతి విధానం రూపొందించాలని రాష్ట్రాలకు ఆదేశాలు.**

**ఢిల్లీ, మహా:** దేశంలోని జైళ్లలో వృద్ధాప్యంతో బాధపడుతున్న, ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న ఖైదీల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించింది. వయోభారం, నయం కాని వ్యాధుల కారణంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఖైదీల ముందస్తు విడుదలకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే విధమైన విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు మూడు నెలల్లో సమగ్ర విధానాన్ని రూపొందించి నోటిఫై చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ తీర్పు దేశ జైలు వ్యవస్థలో మానవ హక్కుల పరిరక్షణకు కీలక మైలురాయిగా భావిస్తున్నారు.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలు, 70 సంవత్సరాలు దాటిన వృద్ధ ఖైదీలను తగిన సందర్భాల్లో బెయిల్‌పై లేదా కారుణ్య ప్రాతిపదికన విడుదల చేయాలని కోరుతూ నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అనంతరం ఈ తీర్పు వెలువడింది. ఖైదీల విడుదలకు సంబంధించిన అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, పరిశీలన ప్రక్రియ, నిర్ణయం తీసుకునే గడువు వంటి అంశాలను స్పష్టంగా పేర్కొంటూ రాష్ట్రాలు సమగ్ర విధానాన్ని రూపొందించాలని ధర్మాసనం సూచించింది.

ప్రాణాంతక వ్యాధి అనే పదానికి దేశవ్యాప్తంగా ఒకే విధమైన నిర్వచనం ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రాలవారీగా వేర్వేరు ప్రమాణాలు అమలులో ఉండే అవకాశం ఉన్నందున, అర్హత నిర్ణయంలో అసమానతలు తలెత్తకుండా ఏకరీతి విధానం రూపొందించాలని పేర్కొంది. ఇందుకోసం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీలతో సంప్రదింపులు జరిపి వారి సూచనలు తీసుకోవాలని కూడా ఆదేశించింది. దీనివల్ల అర్హులైన ఖైదీలను త్వరగా గుర్తించి, వారి దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించడం సులభమవుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది.

కారుణ్య విడుదల ప్రక్రియలో పారదర్శకత, సమయపాలన అత్యంత కీలకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఖైదీలు లేదా వారి కుటుంబ సభ్యులు సులభంగా దరఖాస్తు చేసుకునే విధానం అందుబాటులో ఉండాలని, ప్రతి దరఖాస్తును నిర్దిష్ట గడువులో పరిశీలించి నిర్ణయం తీసుకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ ప్రక్రియ సమర్థవంతంగా అమలు కావడానికి అవసరమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, సాంకేతిక సహాయం, అధికారులకు శిక్షణ, సిబ్బంది సామర్థ్య పెంపు వంటి అంశాల్లో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కూడా ఆదేశించింది.

ఈ తీర్పు అమలుపై కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఆరు నెలల్లో పురోగతి నివేదికను అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టుకు సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. రూపొందించే విధానంలో విడుదలకు అర్హత ప్రమాణాలు, దరఖాస్తు చేసుకునే విధానం, పరిశీలన ప్రక్రియ, నిర్ణయం తీసుకునే గడువు, విడుదల అమలు విధానం వంటి అన్ని అంశాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించింది.

జైళ్లలో నెలకొన్న అధిక రద్దీ, వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీల పరిస్థితిని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. తగిన వైద్య సేవలు, నిరంతర సంరక్షణ అందించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, జైళ్ల సామర్థ్యానికి మించి కిక్కిరిసిపోవడంతో అలాంటి సేవలు అందించడం కష్టంగా మారిందని వివరించింది. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలోని జైళ్ల ఆక్యుపెన్సీ రేటు 131 శాతానికి చేరిందని, దీనివల్ల మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయని పేర్కొంది.

ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, ఖైదీల రాజ్యాంగబద్ధ హక్కులు, మానవ గౌరవాన్ని కాపాడే దిశగా దేశవ్యాప్తంగా ఏకరీతి విధానం అమలు చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. వృద్ధులు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీల విషయంలో మానవతా దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవడం న్యాయవ్యవస్థ బాధ్యత మాత్రమే కాకుండా సంక్షేమ రాజ్య లక్ష్యాలకు అనుగుణమైన చర్యగా కూడా ఈ తీర్పు నిలవనుందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## 9వ తరగతిలో మూడో భాషపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**విద్యార్థులపై అదనపు భారం వద్దని కేంద్రానికి సూచన.**




**ఢిల్లీ, మహా :** తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేసే అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పదో తరగతి బోర్డు పరీక్షలకు పునాది వేసే ఈ దశలో విద్యార్థులపై కొత్త భాష రూపంలో అదనపు విద్యా భారం మోపడం సమంజసం కాదని అభిప్రాయపడింది. విద్యా సంస్కరణలు అవసరమే అయినప్పటికీ, వాటి అమలు విద్యార్థుల మానసిక ఒత్తిడి, విద్యా ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని జరగాలని సూచించింది. ఈ నేపథ్యంలో తొమ్మిదో తరగతిలో మూడో భాషను తప్పనిసరి చేసే నిర్ణయంపై మరోసారి పునరాలోచించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

సీబీఎస్ఈ అమలు చేయనున్న మూడు భాషల విధానాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కొత్త భాషలను నేర్చుకోవడం విద్యార్థుల మేధో వికాసానికి ఉపయోగపడుతుందని అంగీకరించిన న్యాయస్థానం, అయితే బోర్డు పరీక్షలకు సన్నద్ధమయ్యే కీలక దశలో అదనపు సిలబస్‌ను విధించడం విద్యార్థులపై అనవసర ఒత్తిడిని పెంచుతుందని అభిప్రాయపడింది. చిన్న తరగతుల నుంచే మూడో భాషను బోధిస్తే విద్యార్థులు సహజంగా అలవాటు పడే అవకాశం ఉంటుందని కూడా పేర్కొంది.

ఇటీవల సీబీఎస్ఈ తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయంపై దేశవ్యాప్తంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాలల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమలుకు తగిన సమయం ఇవ్వకపోవడం, అవసరమైన పాఠ్యపుస్తకాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఇతర విద్యా వనరులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. ఈ పరిస్థితుల్లో విధానాన్ని అమలు చేయడం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే సుప్రీంకోర్టు ప్రస్తుతం మూడు భాషల విధానాన్ని పూర్తిగా నిలిపివేయలేదు. కేవలం తొమ్మిదో తరగతిలో దానిని తప్పనిసరి చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి సమగ్రంగా పరిశీలించాలని సూచించింది. ఈ అంశంపై తదుపరి విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం, సీబీఎస్ఈ తమ వైఖరిని న్యాయస్థానానికి వివరించనున్నాయి. ఆ తర్వాత న్యాయస్థానం తదుపరి నిర్ణయం వెలువరించే అవకాశం ఉంది. విద్యార్థుల ప్రయోజనాలు, విద్యా ప్రమాణాలు, జాతీయ విద్యా విధానం లక్ష్యాల మధ్య సమతుల్యత ఉండేలా నిర్ణయాలు తీసుకోవాలని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## ట్రంప్ శవపేటిక చిత్రం కలకలం

**టెహ్రాన్ హోర్డింగ్‌పై హెచ్చరికలు.. అంతర్జాతీయంగా చర్చనీయాంశం.**




**ఢిల్లీ, మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ అంతర్జాతీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. ట్రంప్ శవపేటికలో ఉన్నట్టుగా రూపొందించిన చిత్రంతో పాటు ఆయనను అంతం చేస్తామంటూ ఇంగ్లిష్, పర్షియన్ భాషల్లో రాసిన హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఈ హోర్డింగ్ మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.టెహ్రాన్‌లోని ప్రముఖ ఎంఘిలాబ్ స్క్వేర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ హోర్డింగ్‌పై మినాబ్ ప్రాంతానికి చెందిన చిన్నారుల స్మృత్యర్థమని కూడా పేర్కొన్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై జరిగిన తొలి దాడిలో మినాబ్ నగరంలోని ఒక పాఠశాలపై దాడి జరిగి పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ప్రస్తావిస్తూ ఈ నిరసన సందేశాన్ని ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ఆ ఘటనలో మరణించిన చిన్నారులకు నివాళిగా, అమెరికా విధానాలకు వ్యతిరేకంగా ఈ హోర్డింగ్ ఏర్పాటు చేసినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.ఇదిలా ఉండగా, డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి సంబంధించిన కుట్రలు జరిగే అవకాశం ఉందని ఇజ్రాయెల్ కొద్ది రోజుల క్రితమే అమెరికా అధికారులను అప్రమత్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ నిఘా సంస్థల నుంచి అందిన సమాచారాన్ని అమెరికా భద్రతా సంస్థలు కూడా అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ట్రంప్ భద్రతకు ముప్పు ఉండవచ్చనే అంశంపై అమెరికా నిఘా సంస్థలు అప్రమత్తంగా ఉన్నట్లు కూడా కథనాలు వెలువడ్డాయి .ఈ పరిణామాల అనంతరం డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తనపై ఎలాంటి దాడికి ప్రయత్నించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇరాన్ వైపు భారీ స్థాయిలో క్షిపణులను సిద్ధంగా ఉంచామని, అమెరికా ప్రయోజనాలు లేదా తన భద్రతకు ముప్పు కలిగించే ఏ చర్యనైనా కఠినంగా తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు వెలువడిన నేపథ్యంలో ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశాలపై అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.మధ్యప్రాచ్యంలో ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల మధ్య టెహ్రాన్‌లో ప్రదర్శించిన ఈ హోర్డింగ్ మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న రాజకీయ, భద్రతా పరిణామాలు అంతర్జాతీయ శాంతి, స్థిరత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్న అంశం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.



## ఎల్‌నినో ప్రభావంపై పాలకుర్తి రైతు వేదికలో అవగాహన సదస్సు

- **ఎస్సీ,ఎస్టీ రైతులకు ఉచితంగా రాగి విత్తనాలు, కలుపు యంత్రాల పంపిణీ**

పాలకుర్తి జూలై 16 మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని ప్రస్తుత వానాకాలం 2026 సీజన్‌లో ఎల్‌నినో దుష్ప్రభావాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, రైతులు సాంప్రదాయ వరి సాగును కొంత మేర తగ్గించి, తక్కువ నీటితో పండే ఆరుతడి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని అధికారులు పిలుపునిచ్చారు. గురువారం పాలకుర్తి గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, మరియు పెద్దపల్లి రైతు విజ్ఞాన కేంద్రం సంయుక్తాధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావంప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా రామగుండం ఏఎంసీ చైర్మన్ గడ్డం తిరుపతి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జి.శ్యాం ప్రసాద్, రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఓ. సంపత్ లు మాట్లాడుతూ.. ఎల్‌నినో పరిస్థితి కారణంగా ఈ సీజన్ మొత్తం ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే సూచనలు లేవన్నారు.జలాశయాలు, ప్రాజెక్టులు, చెరువులు నిండే పరిస్థితి లేకపోవడంతో కాలువల ద్వారా నీటి సరఫరా కష్టమవుతుందని, భూగర్భ జలాలు సైతం తగ్గి బోర్ బావుల్లో మోటర్లు ఎక్కువ రోజులు నడిచే పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో బోర్ల క్రింద, బావుల క్రింద ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటను పూర్తిగా సాగు చేయకుండా. కొంత భాగంలో జొన్న, పెసలు, మినుములు, కంది, పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయాబీన్, ఆముదం, రాగులు వంటి తక్కువ నీటితో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు ప్రభుత్వం ఉచితంగా విత్తనాలు, కలుపు తీయు యంత్రాల పంపిణీ ఈ సదస్సులో ఎస్సీ,ఎస్టీ రైతు సోదరులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీ రైతులకు ఉచితంగా రాగి విత్తనాలతో పాటు,సుమారు రూ.2,000 విలువ గల ఆరుతడి పంటల కలుపు తీయు యంత్రాలను అధికారులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే ఎస్టీ రైతులకు ఉచితంగా పెరటి తోటల పెంపకానికి ఉపయోగపడే కూరగాయల విత్తనాల కిట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, ఉద్యానవన శాఖ అధికారి ఏ.జ్యోతి, హెచ్.ఈ.ఓ బి.రాము, తిరుమల ప్లాంటేషన్ ఆఫీసర్ ప్రశాంత్, ఏఈఓలు ఎం.సువర్ణరేఖ, కే.శ్రీకాంత్, జే.సుష్మలతో పాటు పరిసర ప్రాంతాల నుండి సన్న, చిన్నకారు ఎస్సీ,ఎస్టీ రైతులు పాల్గొన్నారు.




## డిగ్రీతో పాటు ఉద్యోగావకాశం..

### బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఈడీపీ కోర్సులు

**బెల్లంపల్లి, మహా:** డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా, చదువుతో పాటు ఉద్యోగానికి అవసరమైన శిక్షణ అందించే ప్రత్యేక అవకాశాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడీపీ) ద్వారా విద్యార్థులు డిగ్రీతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను కూడా పొందే అవకాశం ఉంది.ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు మొదటి రెండు సంవత్సరాలు కళాశాలలో సాధారణ తరగతులు నిర్వహిస్తారు. మూడో ఏడాది సంబంధిత పరిశ్రమలు, సంస్థల్లో స్టైఫండ్‌తో కూడిన అప్రెంటిస్‌షిప్ శిక్షణ అందిస్తారు. దీంతో డిగ్రీ పూర్తయ్యే సమయానికి విద్యార్థులు ఉద్యోగానికి అవసరమైన అనుభవాన్ని కూడా సొంతం చేసుకుంటారు.ప్రస్తుతం కళాశాలలో బీఏ ఆనర్స్, బీకాం బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్), బీకాం ఈకామర్స్, బీఎస్సీ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్, బీఎస్సీ హార్టికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్ వంటి ఐదు ఏఈడీపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు బీకాం టాక్సేషన్ కోర్సు కూడా విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తోందని కళాశాల వర్గాలు తెలిపాయి.ఈ కోర్సులు ముఖ్యంగా గ్రామీణ, పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు. ఉన్నత విద్యతో పాటు ఉద్యోగావకాశాలు పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏఈడీపీ కోర్సుల ద్వారా విద్యార్థులు చదువు పూర్తయ్యేలోపే పరిశ్రమల పని విధానాన్ని తెలుసుకునే అవకాశం ఉండటంతో ఉద్యోగాల్లో త్వరగా స్థిరపడే అవకాశం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలను సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 99592 69975 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో మెనూ ప్రకారం భోజనం అందించని కాంట్రాక్టర్ పై చర్య తీసుకోవాలి

**బెల్లంపల్లి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన ఆహారాన్ని అందజేసేందుకు ఏర్పాటు చేసినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్ మెనూ ప్రకారం భోజనాన్ని రోగులకు అందించడం లేదని సంబంధిత కాంట్రాక్టర్ పై చర్య తీసుకొని మరొకరిని కేటాయించాలని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గురువారం నాడు బెల్లంపల్లి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆసుపత్రి సూపర్డెంట్ రవి కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గానికి పెద్దదికైనా ఈ హాస్పిటల్ ఏడు మండలాల నుండి ఎంతోమంది ప్రజలు వస్తూపోతూ ఉంటారనీ, మెనూ ప్రకారం భోజనాలు అందించడం లేదని ఉదయం పూట అల్పాహారం ఇవ్వడం లేదని, ఇడ్లీ, పొంగల్, ఉప్మా ,బ్రెడ్ ముక్కలు, కాచిన పాలు , అలాగే, మెనూలో మధ్యాహ్నం భోజనం లో కోడిగుడ్డు అరటిపండు, పెరుగు ఉన్నా కూడా ఆసుపత్రిలో ఉన్న రోగులకు అందించకపోవడం అనేది చాలా బాధాకరం ఉందని ఇప్పటికైనా వివిధ మండలాల నుండి వస్తున్న రోగులకు, అల్పాహారం, మరియు మధ్యాహ్నం భోజనం లో కోడిగుడ్డు అరటిపండు పెరుగు అందించేలా చూడగలరని అదే విధంగా సదరు కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని ఆస్పత్రికి వచ్చే రోగులకు మంచి భోజనం ఏర్పాటు చేసి ,వేరే కాంట్రాక్టర్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.




# అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డుల తొలగింపు పై ప్రత్యేక డ్రైవ్

- **నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు**
- **జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



**వరంగల్, కార్పొరేషన్ మహా:** గ్రేటర్ వరంగల్ నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్) డి ఆర్ ఎఫ్ బృందాలు ఏసీపీ ల నేతృత్వంలో గురువారం నగర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్, హన్మకొండ మిషన్ హాస్పిటల్, సర్క్యూట్ గెస్ట్ హౌస్, తదితర ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులు, ప్రచార బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, నగర సౌందర్యానికి భంగం కలిగించే విధంగా ఎవరూ విచ్చలవిడిగా ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. నగర సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో వారం రోజుల వ్యవధిలో నగరంలోని అన్ని అనధికార ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.రెండో విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, గోడలపై అనుమతి లేకుండా రాసిన వాల్ రైటింగ్స్, పోస్టర్లు, పెయింటింగ్‌లను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించే ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్‌లు రూపొందించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.జీడబ్ల్యూఎంసి పరిధిలో నెల రోజుల పాటు ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నగరంలో ఉన్న అన్ని అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు లేదా ఇతర సంస్థలు మున్సిపల్ అనుమతి లేకుండా ఎలాంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ చట్టాల ప్రకారం భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, పార్కులు, విద్యుత్ స్తంభాలు, సెంట్రల్ డివైడర్లు, రహదారి కూడళ్లు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రయాణికుల ప్రాంగణాల తో పాటు ఇతర బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా గోడపత్రికలు, స్టిక్కర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, ప్రచార బోర్డులు ఏర్పాటు చేయడం పూర్తిగా నిషేధించబడిందని కమిషనర్ తెలిపారు.స్వచ్ఛమైన, సుందరమైన, క్రమబద్ధమైన గ్రేటర్ వరంగల్ నిర్మాణమే జీడబ్ల్యూఎంసీ లక్ష్యమని. నగర సౌందర్యాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. ప్రజలందరూ మున్సిపల్ నిబంధనలను పాటిస్తూ నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ టి. వెంకన్న కోరారు.

# నర్సంపేటలో ఎస్ఐఆర్ సర్వే పరిశీలన

- **విద్యతోనే విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **పాఠశాలలో అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్**



**వరంగల్, మహా** : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద గురువారం నర్సంపేట పట్టణంలోని వల్లభ్ నగర్, సాయినగర్ కాలనీ 149,156,159 పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటించి బూత్ లెవల్ అధికారుల (బీఎల్ఓలు) ఇంటింటి సర్వేను పరిశీలించారు.ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి అయిన ఓటర్ల వివరాల నమోదు పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి బీఎల్ఓల పనితీరుపై ఆరా తీశారు.క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హుడైన ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం లో వివరాలను పరిశీలించి చూడాలని, ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**మోడల్ పాఠశాల తనిఖీ**

జిల్లా నర్సంపేట పాకాల రోడ్డులోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల (మోడల్), ఇంగ్లీష్ మీడియం ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యం, పాఠ్యాంశాల పై అవగాహనను ప్రశ్నల ద్వారా పరీక్షించారు.
విద్యార్థులు చురుకుగా చదువు పై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం నాణ్యత పెంపు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదల కోసం సమర్థవంతమైన బోధనా విధానాలను అమలు చేయాలని సూచించారు ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతి విద్యార్థి పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత, మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, బోధన-అభ్యాస వాతావరణాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రధానోపాధ్యాయుని పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పాఠశాలలో పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, జీవన నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులను సమగ్ర వ్యక్తిత్వంతో తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.
ఈ సందర్శనలో ఆర్డీఓ నర్సంపేట ఉమారాణి, నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఫేక్ డాక్యుమెంట్స్ తో స్థలం కబ్జా

**తండ్రీ కొడుకులపై కేసు**
**కొడుకు అరెస్ట్ తండ్రి పరారీ**

**ఆదిలాబాద్ మహా :** నకిలీ పత్రాలు సృష్టించి స్థలం కబ్జా చేసిన కేసులో పట్టణానికి చెందిన రంగినేని శ్రీనివాస్, రంగినేని సూర్య ప్రకాష్ అనే తండ్రి కొడుకులపై కేసు నమోదు చేసినట్టు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.గురువారం పోలీస్ స్టేషన్ లో మీడియాకు వివరాలు వెల్లడించారు. నకిలీ పత్రాలు సృష్టించి బ్యాంకును సైతం నిందితులు మోసం చేసినట్టు తెలిపారు. కొడుకును అరెస్టు చేయగా తండ్రి పరారీ లో ఉన్నట్టు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ గృహిణి తన స్థలాన్ని 2016 లో నిందితుడు రంగినేని సూర్య ప్రకాష్ కు మూడు సంవత్సరాల వ్యవధికి లీజుకు అప్పజెప్పిందన్నారు. 2019 లో లీజు పూర్తయిన తర్వాత తిరిగి స్థలాన్ని అప్పగించవలసి ఉన్నా, నిందితుడు ఎటువంటి మున్సిపాలిటీ అనుమతులు లేకుండా సదరు లీజు స్థలంలో అక్రమంగా ఇల్లును నిర్మించి, ఆ స్థలాన్ని ఎలాగైనా ఆక్రమించాలని దానికి 1983 సంవత్సరానికి చెందిన మున్సిపల్ చైర్మన్ లక్ష్మణరావు పేరుపై, మున్సిపాలిటీ కౌన్సిల్ జారీ చేసినట్లుగా చైర్మన్ కౌన్సిలర్ల నకిలీ సంతకాలు నకిలీ స్టాంపులతో నకిలీ ప్రొసీడింగ్ పత్రాలను సృష్టించి, దానికి నకిలీ పట్టా సర్టిఫికెట్ ను సృష్టించారన్నారు. దీనికి 2009లో నకిలీ మున్సిపాలిటీ పర్మిషన్ పత్రాలను సృష్టించి, ఈ పట్టా సర్టిఫికెట్ సహాయంతో రంగనేని సూర్యప్రకాష్ పేరుపై ఉన్న భూమిని గిఫ్ట్ డీడ్ ద్వారా రంగనేని శ్రీనివాస్ పేరుపై 2023 సంవత్సరంలో మార్చుకున్నారని తెలిపారు. వెంటనే ఈ నకిలీ పత్రాలను ఉపయోగించి ఎస్బిఐ సిసిఐ బ్రాంచ్ బ్యాంక్ ద్వారా సోలార్ బిజినెస్ చేస్తామని 49 లక్షల లోను సైతం తీసుకున్నారన్నారు. దీనికి సంబంధించిన కిస్తీలు చెల్లించని పక్షంలో ఎస్బిఐ బ్యాంకు గత వారం రోజుల క్రితం పేపర్ నందు ఎస్పీఏ చేస్తామని ప్రకటన చేసిందన్నారు. నకిలీ పత్రాలను సృష్టించడంలో సహాయపడ్డ నిందితులపై దర్యాప్తు కొనసాగుతుందని నిందితులు ఎవరైనా వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.






రంగినేని శ్రీనివాస్



రంగినేని సూర్య ప్రకాష్

## పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు

**వాహనాలు, క్వింటాల్ అమ్మోనియం బై కార్బోనేట్, లిక్కర్ బాటిల్స్ స్వాధీనం**
**ఇద్దరిపై కేసు నమోదు**


అదిలాబాద్ మహా : ప్రజల రక్షణ, సంరక్షణ సక్రమంగా నిర్వహించడానికి కమ్యూనిటీ కాంటాక్ట్ లను నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామంలో 120 మంది సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ను నిర్వహించినట్టు తెలిపారు. ఈ తనిఖీలలో సరైన ధ్రువ పత్రాలు లేని 156 ద్విచక్ర వాహనాలు, 2 ఆటో లను, 8 కార్లు, బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, నెంబర్ ప్లేట్ లేని 3 వాహనాలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే అక్రమంగా కల్తీ కల్లు తయారు చేయడానికి ఉపయోగపడే ముడి సరుకు అమ్మోనియం బై కార్బొనేట్ ఒక క్వింటాల్ వరకు స్వాధీనం చేసుకొని నిందితుడు సురేందర్ గౌడ్ పై కేసు నమోదు చేసామని , అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పి. శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి వద్ద దాదాపు 200 బాటిల్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సక్రమంగా జీవించాలని ఎస్పీ తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, దొంగతనాలు, దోపిడీలు చేయకుండా, సత్ప్రవర్తనతో మెదలాలని తెలిపారు. గొడవలకు దారి తీసేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వీడిసి అక్రమాలు, బలవంతపు వసూళ్లు, నంబర్ ప్లేట్లు లేకుండా తిరగడం, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం లాంటివి చేయవద్దని తెలిపారు. ఇదివరకే కేసులలో నమోదైన వారిపై సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్స్ ఓపెన్ చేయడం జరిగిందని, మిగిలిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామ ప్రజలు నేరాలు చేసే వారి సమాచారం 8712659973 నెంబర్ కు వాట్సప్ ద్వారా సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. విద్యార్థులకు చిన్నప్పటి నుండి చదువుపై ఆసక్తి పెంచేలా తల్లిదండ్రులు కృషి చేయాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యం పై దృష్టి సారించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండాలని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సక్రమంగా వాహనాలను నడుపుతూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి ఎన్ వెంకట నరసయ్య, ఎ ఆర్ డిఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సిఐ నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకటి, టి మురళి, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





## ఎస్ఐఆర్ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎస్ఐఆర్ ప్రచార రథాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. పేరు నమోదు, చిరునామా మార్పు, వివరాల సవరణ, తొలగింపులు వంటి అవసరమైన దరఖాస్తులను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేలా చైతన్యం కల్పించడమే ఈ ప్రచార రథం లక్ష్యమన్నారు. ప్రచార రథం ప్రతి ప్రాంతానికి చేరుకుని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రజలకు వివరాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, బైరి నవీన్ గౌడ్ ఇంద్రయ్య ఎంకే బద్రుద్దీన్ మహేష్ కృష్ణ గౌడ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఏసీబీ కి చిక్కిన ఇరిగేషన్ ఇంజినీర్లు

**ఆదిలాబాద్ మహా :** ప్రభుత్వ జీతం తీసుకుంటూ అవినీతికి పాల్పడుతున్న అధికారుల ఆట కట్టిస్తున్నారు ఏసీబీ అధికారులు. గురువారం ఆదిలాబాద్‌పట్టణంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు. సొనాలకు చెందిన ఓ వ్యక్తి ఎన్వోసీ కార్యాలయాన్ని సంప్రదించగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విట్టల్, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించినట్టు తెలిపారు.గురువారం కార్యాలయంలో 60వేల రూపాయలు అందిస్తుండగా ఆదిలాబాద్ రేంజ్ ట్రాప్ బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నివాసం నేరెడ్ మెట్ లోను సోదాలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ అధికారులు సిబ్బంది ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే 1064 లేదా ఏసీబీ డీఎస్పీ 9154688963 నెంబర్ కు ఫోన్ చేసి సమాచారమందించాలని సూచించారు.

# బెల్లంపల్లి లో నేడు రైస్ మిల్ హమాలీ కార్మికుల రేట్ల పెంపుపై యజమానులతో సమావేశం

- **బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్లర్స్ హమాలీ వర్కర్స్ ప్రెసిడెంట్ గెల్లి రాజలింగు యాదవ్**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి లో రైస్ మిల్ హమాలీ కార్మికుల రేట్ల పెంపుపై యజమానులతో సమావేశంను శుక్రవారం రోజు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్లర్స్ హమాలీ వర్కర్స్ ప్రెసిడెంట్ గెల్లి రాజలింగు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఎంమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచన మేరకు .రైస్ మిల్ హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న పెరుగుతున్న జీవన వ్యయం, కూలీల సమస్యలు మరియు ప్రస్తుత హమాలి రేట్లు సరిపోకపోవడం వంటి అంశాలపై శుక్రవారం రైస్ మిల్ యజమానులతో సమావేశం నిర్వహించబడుతుందనిసమావేశంలో ప్రధానంగా హమాలీ కూలీ రేట్ల పెంపు ,యజమానులు -కార్మికుల మధ్య పరస్పర అవగాహనతో నిర్ణయం, ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రేట్ల ఖరారు వంటి అంశాలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.హమాలీ కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని ఆయన సూచించారు.

# గుడిసెలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి జూలై 16 మహా : అనాజిపురం గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరి ప్రక్రియలో భాగంగా గుడిసెలను యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం పరిశీలించారు మోత్కూర్ మండలం అనాజిపురం గ్రామంలోని జంగాల కాలనీలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా గుడిసెలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాలనీలో మొత్తం ఎన్ని గుడిసెలు ఉన్నాయో, వాటిలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ఎన్ని గుడిసెలు ఉన్నాయో అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుడిసెలను కలెక్టర్ స్వయంగా పరిశీలించి, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి అర్హులైన లబ్ధిదారులందరికి ఇవ్వడం జరిగిందన్నారు.అనంతరం మొదటి విడతలో మంజూరై ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి ఎన్ని రోజులు అవుతుందో అని అడిగి తెలుసుకొని, పనులు ఏ దశలో ఉన్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పూర్తయినంత వరకు బిల్లులు వచ్చాయా ,లేదా అని ఆరా తీశారు.ఇంటి నిర్మాణాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసుకోవాలని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. నాణ్యతతో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆపదలో ఆదుకునేందుకే ఆపద మిత్ర

**ఆదిలాబాద్ మహా**: జిల్లాలో విపత్తుల సమయంలో అత్యవసర సహాయక చర్యలు అందించేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం స్థానిక టిటిడిసిలో కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా చేపట్టిన మూడు రోజుల 'ఆపద మిత్ర' ఓరియంటేషన్ శిక్షణా ముగింపు శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనలను వీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుమారు 40 మంది విద్యార్థిని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నూతన నైపుణ్యాలను నేర్చుకున్నారని తెలిపారు. వరదలు, అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు లేదా మానవ తప్పిదాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణమే స్పందించి రెస్క్యూ ఆపరేషన్లు చేపట్టడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. ఇలాంటి అత్యవసర సహాయక చర్యల కోసం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఎన్డిఎంఏ, అలాగే తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అత్యాధునిక పరికరాలు, మౌలిక వసతులు జిల్లాకు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న విపత్తు నిర్వహణ అంశాలు విద్యార్థుల భవిష్యత్తుకు, వారి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి సురేష్ కుమార్, స్టేషన్ అగ్నిమాపక అధికారి జైత్రం, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది వర్ష, అగ్నిమాపక శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది, శిక్షకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# డీఎస్పీ ఆధ్వర్యంలో తనిఖీలు

**ఆదిలాబాద్ మహా**: బేల మండలంలోని మారుతి గూడ గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి శాంతిభద్రతల పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గుడుంబా తయారీపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు 1 లీటర్ గుడుంబాను, గుడుంబా తయారీకి వినియోగిస్తున్న పాత్రలు, సామగ్రిని ధ్వంసం చేశారు. అలాగే గుడుంబా తయారీ కోసం నిల్వ ఉంచిన మహువా పూల పులిసిన ద్రావణాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గ్రామంలో వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి పలు నిబంధనలు ఉల్లంఘించిన 40 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గుడుంబా తయారీ, విక్రయాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని అన్నారు. గ్రామంలో సిసిటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ జి. శ్రావణ్ కుమార్, ఎస్ఐలు మధుకృష్ణ, గౌతమ్, పీర్ సింగ్ నాయక్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భావి జీవితానికి ఉపాధ్యాయుల బోధనే కీలకం

- **నాణ్యమైన ఆంగ్ల భాష, కృత్రిమ మేధస్సు పై అవగాహన పెంపొందించాలి**
- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



**మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించిన కలెక్టర్**

ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం అనంతరం పాఠశాల ఆవరణలోని వంటశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం ఏ వంటకాలు సిద్ధం చేస్తున్నారని వంట నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఆలూ కర్రీ తయారు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలపగా, వండిన అన్నం, కూర నాణ్యతను పరిశీలించారు.కిచెన్ షెడ్డులో పరిశుభ్రత, ఆహార తయారీ విధానాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు .ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ మన్మోహన్, ఎంఈఓ నెహ్రూ నాయక్, ఉపాధ్యాయులు, శిక్షణలో పాల్గొన్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ, మహా** : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భావి జీవితానికి బలమైన పునాదిని పాఠశాల స్థాయిలోనే ఉపాధ్యాయులు వేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఇన్‌సర్వీస్ టీచర్ ట్రైనింగ్ (రెండో విడత) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడి, శిక్షణ ద్వారా నేర్చుకుంటున్న అంశాలు, వాటిని తరగతి గదిలో ఎలా అమలు చేయనున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బోధనా నైపుణ్యాల పెంపు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఇటువంటి శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో ముఖ్యంగా ఆంగ్ల భాషపై పట్టు పెంపొందేలా బోధన సాగించాలని, తద్వారా వారి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు, భవిష్యత్ కెరీర్‌కు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలోకి వెళ్లే ముందు పాఠ్యాంశం పై పూర్తి స్థాయిలో సిద్ధమై బోధించాలని, ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించి విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ అత్యుత్తమ విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.అదేవిధంగా, విద్యా రంగంలో వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏI) వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని, విద్యార్థులకు కూడా దాని ఉపయోగాలు, అవకాశాలపై సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, అభ్యాస పద్ధతులు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు.

## ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి దే విజయం

- **ఏలే చంద్రశేఖర్ బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యులు**

**భువనగిరి జూలై 16 మహా న్యూస్**రా ష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపిదే విజయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ అన్నారు గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ఆయన మండిపడ్డారు ప్రజలు బిజెపి వైపేచూస్తున్నారని అన్నారు మండల అధ్యక్షులు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించగా చిక్క కృష్ణ చెరుకు వెంకటేశం కాడి బసవయ్య గంజి బసవలింగం మేకల చొక్కా రెడ్డి ముద్ద హరీష్ బోదాస్ మల్లేష్ చంద్రవాస్ వైరు వెంకటేష్ బద్ద వెంకరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఆప్యాయతకు అడ్రస్ ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**భువనగిరి జూలై 16 మహా న్యూస్** : ఆప్యాయతకు అడ్రస్ ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం నియోజకవర్గంలో రోజువారి కార్యక్రమంలో బిజీగా ఉండే వేముల వీరేశం గురువారం మధ్యాహ్న భోజన సమయంలో ఎదురుగా వచ్చిన పాత్రికేయులను ఆప్యాయతగా పిలుచుకొని తాను తెప్పించుకున్నమధ్యాహ్న భోజనం విలేకరులతో కలిసి భోజనం చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు



# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఖమ్మం అడిషనల్ కలెక్టర్

- **ఆన్ లైన్ నమోదు వేగవంతం చెయ్యాలన్న ఖమ్మం ఈఆర్ఓ శ్రీజ**
- **నిర్ణీత గడువులోపు పూర్తి చెయ్యాలని బిఎల్ఓ లకు ఆదేశం**

జూలూరుపాడు, మహా: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల పరిధిలోని పడమట నర్సాపురం గ్రామంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఅర్) ప్రక్రియను ఖమ్మం అడిషనల్ కలెక్టర్, ఖమ్మం ఈఆర్ఓ శ్రీజ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఎస్ఐఅర్ కార్యక్రమం ఎలా జరుగుతుందని, ఓటర్ లందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందాయ లేదా అని ఆరా తీశారు. గ్రామంలో ఎస్ఆర్ఐ ప్రక్రియ ఎంతవరకు వచ్చింది, ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు ఆన్‌లైన్ లో నమోదు చేశారని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు గ్రామంలో జరిగిన ఎన్యూమరేషన్ ఆన్ లైన్ నమోదుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఓటర్లకు ఇబ్బంది కలుగకుండా, నిబంధనల ప్రకారం, పారదర్శకంగా వారి వివరాలను నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆన్ లైన్ చెయ్యాలని ఖమ్మం ఈఆర్ఓ శ్రీజ సిబ్బందికి సూచించారు. ఎస్ఆర్ఐ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని బిఎల్ఓ లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ శ్రీనివాస్, యుడిసి దేశ్ పాండే, గ్రామ కార్యదర్శి, కృష్ణ, వీఆర్ఏ బహరాలి, బిఎల్ఓ సునీత, వెలుగు సిసి నాగేశ్వరరావు, సంఘం చిన్నరాజు, నాగు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో పోలీసుల తనిఖీలు

**మాదకదవ్యాలు విక్రయిస్తే జైలుకే - ఎస్సై గోపి**

**కారేపల్లి, మహా:**గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు నేపథ్యంలో కారేపల్లిలో ఎస్సై బైరు గోపి ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. యువతను లక్ష్యంగా చేసుకుని గంజాయిని చాక్లెట్లు, సిగరెట్లు, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ,పాన్ షాపులు,కిరాణా దుకాణాలపై దృష్టి పెట్టారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై బైరు గోపి సూచించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల విక్రయాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే కారేపల్లి పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

- **పెండింగ్ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరించాలి**
- **రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**
- **అధికారులతో సమీక్షా సమావేశం**



**నిర్మల్ మహా :** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలు, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటాలకు చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, కమిషన్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతి, అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, ఛార్జిషీట్ల దాఖలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డుదారులకు కల్పిస్తున్న ఉపాధి వంటి అంశాలను సమీక్షించారు .ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఆలస్యం లేకుండా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేసి బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చూడాలని సూచించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి తగిన పని దినాలు కల్పించాలని, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అభివృద్ధి నిధులు ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి విడుదలయ్యేలా కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 4,306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎస్సీ, ఎస్టీ కూలీలకు ఉపాధి కల్పనలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. బ్యాంకుల ద్వారా 199 ద్విచక్ర, త్రిచక్ర విద్యుత్ వాహనాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందించినట్లు పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతంగా కొనసాగుతోందని, వివిధ దశల్లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమిషన్ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, 60 సంవత్సరాలు పూర్తి చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయికిరణ్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే డబ్లింగ్ భూ సమస్యపై సంయుక్త పరిశీలన

**రైతులకు న్యాయం జరిగేలా చర్యలు- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్**

కారేపల్లి, మహా:డోర్నకల్ -భద్రాచలం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కు సేకరిస్తున్న భూములపై నెలకొన్న వివాదమై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్( భూసేకరణ) ఆధ్వర్యంలో గురువారం రెవిన్యూ, అటవీ, రైల్వే, అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన నిర్వహించారు. కోమట్లగూడెం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వే నెం.67 కి చెందిన భూమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా భూమి హద్దులు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, అటవీ శాఖల నివేదికలు, రికార్డుల ఆధారంగా సమస్యను త్వరితగతిన పరిష్కరించే చర్యలు తీసుకుంటామని భూ నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ, రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం రైల్వే శాఖకు భూమిని ఏ విధంగా బదిలీ చేయాలి, పరిహారం అంశాన్ని ఎలా అమలు చేయాలనే విషయాన్ని6 స్పష్టం చేస్తామని తెలిపారు. పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. ఈ సందర్భంగా గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, భూ నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ సమస్యను వైరా ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి,రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, ఆర్ఐ, జీపీఓ, అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ, డీఆర్ఓ, ఎఫ్‌బీఓ, రైల్వే శాఖ డీఈ, జేఈ, ఒడ్డుగూడెం, చర్లపల్లి, గాదెపాడు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు రైతులు పాల్గొన్నారు.



# చామనపల్లి పోడు భూముల విషయంలో రైతులకు అటవీ శాఖ అధికారులకు మధ్య వాగ్వాదం

**రైతు పురుగుల మందు సేవించడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

**బెల్లంపల్లి, మహా :** బెల్లంపల్లి నియోజకవర్గం వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామం పరిధిలోని పోడు భూముల విషయంలో సాగు చేసుకుంటున్నా రైతులకు అటవీ శాఖ అధికారులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుని ఓ రైతు పురుగుల మందు సేవించడంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే బుధవారం రోజు చామానపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రెవెన్యూ సర్వే నెంబర్ 67 కాగా అటవీ శాఖ రికార్డుల ప్రకారం చెన్నూరు ఆర్ ఎఫ్ కంపార్ట్మెంట్ నెంబర్ 125 లో అడవి శాఖ అధికారులు మొక్కలు నాటేందుకు సిద్ధమై చదును చేస్తుండగా గోదా కొంతకాలంగా సాగు చేసుకుంటున్న రైతులు అక్కడ చేరుకొని తమకు గత ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేసిందని తాము ఆ భూమిపై ఆధారపడి జీవనాన్ని గడుపుతున్నామని తమకు చెందుతుందని రైతులు గొడవకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుని అటవీశాఖ అధికారులు గత్యంతరం లేక మరుసటి రోజు వస్తామని చెప్పి వెళ్లిపోయారు. గురువారం రోజు చెన్నూరు ఫారెస్ట్ డివిజన్ అధికారి సర్వేశ్వరరావు, నీల్వాయి అటువై క్షేత్రాధికారి హాఫీజ్ ఉద్దీన్, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తో పాటు అటవి శాఖ అధికారులు సంబంధిత వివాదాస్పద భూముల వద్దకు చేరుకున్నారు.దీంతో సంబంధిత వివాదాస్పద భూముల్లో పటవీ శాఖ అధికారులు మొక్కలు నాటేందుకు ప్రయత్నాలు చేస్తుండగా అక్కడికి చేరుకున్న రైతులు అధికారులతో గొడవకు దిగడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది దీంతో చామనపల్లి గ్రామానికి చెందిన నూకల తిరుపతి(40) అనే రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంబంధిత తోటి రైతులు వెంటనే గమనించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు. అనంతరం రైతులు అటవీ శాఖ అధికారులకు మధ్య మాటల యుద్ధం ఏర్పడడంతో సంబంధిత రైతులతో అటవీ శాఖ అధికారులు పోలీసు సిబ్బంది చర్చలు జరిపి సంబంధిత భూములను రెవెన్యూ మరియు అటవీశాఖ అధికారులు ఉమ్మడిగా జాయింట్ సర్వేలు నిర్వహించి రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని వివరించడంతో వివాదం సద్దుమణిగింది

# ఒకే ఇంటి నెంబర్‌పై 79 ఓట్లు

**బాకారం జాగీర్‌లో ఓటర్ల జాబితాలో గందరగోళం**




**మొయినాబాద్ మహా:** ఓటర్ల జాబితాలో తీవ్ర అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల్ బాకారం జాగీర్ గ్రామ పరిధిలోని ఇంటి నెంబర్ 51 పై ఏకంగా 79 ఓట్లు నమోదు కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మరియు వార్డు సభ్యులు గుర్తించి ఈ అక్రమాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం ఆ ఇంట్లో నివాసం ఉండే వారి సంఖ్యకు, ఓటర్ల సంఖ్యకు పొంతన లేదని అంతేకాకుండా అందులో కొంతమంది ఓటర్ల నివాసం ఎనికేపల్లి పరిధి శివారులో ఉంటున్నా వారి ఓటు హక్కు మాత్రం బాకారం జాగీర్ గ్రామంలో నమోదై ఉందని ఈ విషయంపై వెంటనే బిఎల్వోలు స్థల పరిశీలన చేసి, నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలు తొలగించి పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించాలని సర్పంచ్ వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి గందరగోళం ప్రజాస్వామ్యానికి విఘాతం అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# గోల్కొండకు తరలిన కుమ్మరి శాలివాహన కులస్థులు

**మొయినాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్రంలో ఎంతో ఆధ్యాత్మిక వాతావరణం కల్పిస్తూ జరిగే బోనాల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటి భాగమైన గోల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవాలకు మండలంలోని హిమాయత్ నగర్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షుడు కుమ్మరి వినోద్ శాలివాహన ఆధ్వర్యంలో గోల్కొండ బోనాల ఉత్సవాలకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని శాలివాహన కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివెళ్లి గోల్కొండ జగదాంబికా అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కుమ్మరి వినోద్ శాలివాహన మాట్లాడుతూ ప్రతి ఏటా బోనాల ఉత్సవాల్లో గోల్కొండ జగదాంబికా అమ్మవారికి మొదటి బోనాన్ని సమర్పించే హక్కు కుమ్మరులకు దక్కడం అందులో హిమాయత్ నగర్ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో తాము పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సాగిన ఈ బోనాల ఉత్సవాల సంబరాల్లో మాకు అత్యంత ప్రాధాన్యత దక్కినందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాము. అలాగే మొదటి బోనం సమర్పించిన కుమ్మరి సంఘం తరపున గౌరవిస్తూ తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రత్యేక నిధులు కేటాయిస్తే మరింత వైభవంగా జరిగే అవకాశం ఉందని ఈ సందర్భంగా కుమ్మరి వినోద్ శాలివాహన వ్యక్తపరిచారు. గోల్కొండ జగదాంబికా బోనాల ఉత్సవాలకు తరలి వెళ్లిన వారిలో హిమాయత్ నగర్ కుమ్మరి సంఘం సభ్యులు ఉన్నారు.



# పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు డీఈవో

**కారేపల్లి కేజీబీవీ సందర్శించిన. డీఈవో జి.సదానందం**

**కారేపల్లి, మహా :** విద్యార్థులు పట్టుదలతో చదువు మీద శ్రద్ధ పెడితే ఉన్నత స్థాయికి చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి జి.సదానందం అన్నారు. గురువారం కారేపల్లి కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన డీఈవో 10వ తరగతి విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం వంటి దృగ్విషయాలు ఎలా ఏర్పడతాయి, వంటి ప్రశ్నలతో నిత్య జీవిత సంఘటనల గురించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి జీవితం ఎంతో విలువైనదని అనవసరమైన అంశాలకు ప్రాధాన్య ఇవ్వ వద్దన్నారు. పాఠశాల దశలోనే భావి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచనలు చేశారు. మండల పరిధిలోని ఏకరూప దుస్తుల కుట్టే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థినులకు వారం రోజులలో డ్రస్ పంపిణీ చేయాలని సూచించారు. డీఈవో వెంట సీఎంవో బాజోజు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు సమీనా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా జరగాలి

- **బయోమెట్రిక్ హాజరు పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి**
- **డివిజన్ల వారీగా పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ వెంకన్న తో కలసి సమగ్ర సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి**



**హనుమకొండ, మహా ;** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ వరంగల్ నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని, నగర పరిశుభ్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.గురువారం హనుమకొండ కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లు, బయోమెట్రిక్ హాజరు, ప్లాస్టిక్ నియంత్రణ, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై డివిజన్ల వారీగా సమగ్ర సమీక్ష నిర్వహించారు.

సమీక్ష సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జీడబ్ల్యూఎంసీ పరిధిలో పాయింట్ ఆఫ్ సేల్ మెషీన్ల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదాయ వసూళ్లలో పారదర్శకత తీసుకురావాలని, ట్రేడ్ లైసెన్సుల వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

**వర్షా కాల సన్నద్ధత పై ప్రత్యేక దృష్టి**

వర్షాకాలంలో మురుగునీరు నిల్వ కాకుండా నగరంలోని అన్ని అంతర్గత మురుగుకాలువల్లో 100 శాతం డీసిల్టింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, అవసరమైన చోట యంత్రాలతో పాటు గ్యాంగ్‌మెన్‌లను వినియోగించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.నగరంలో ప్రతిరోజూ కనీసం 400 టన్నుల ఘన వ్యర్థాల సేకరణ జరిగేలా శానిటరీ సూపర్వైజర్లు, జవాన్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అన్ని పారిశుధ్య వాహనాలు, కంటైనర్లు, ట్రాక్టర్లు ఎల్లప్పుడూ పనిచేసే స్థితిలో ఉండేలా చూడాలని, మరమ్మతులు అవసరమైతే వెంటనే పూర్తి చేసి పారిశుధ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలి**

తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా సేకరించాలని, ప్రస్తుతం తడి చెత్త సేకరణ ఆశించిన స్థాయిలో లేదని పేర్కొంటూ దానిని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నాలుగు మోడల్ కాలనీల్లో అమలు చేస్తున్న విధానాన్ని సమీక్షిస్తూ, తదుపరి సమావేశం నాటికి తడి చెత్త సేకరణ వ్యవస్థను పూర్తిగా క్రమబద్ధీకరించాలని ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని అన్ని స్వచ్ఛ ఆటోలకు జీపీఎస్ మ్యాపింగ్ పూర్తి చేసి, ప్రతిరోజూ కేటాయించిన ప్రాంతాలను 100 శాతం కవర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు ఘన వ్యర్థాల నిర్వహణ పై ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ప్రతి స్వచ్ఛ ఆటో రోజుకు కనీసం రెండు ట్రిప్పులు చేసి ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు చెత్త తరలించేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.

**వ్యర్థాల నిర్వహణలో వినూత్న చర్యలు**

వ్యర్థ కొబ్బరి బొండాలను వినియోగిస్తూ కోకో కాయర్ యూనిట్ల ఉత్పత్తి పెంచాలని, అలాగే 15 కే ఎల్ డి , 150 కే ఎల్ డి సామర్థ్యాల ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టి ప్రతిరోజూ డీస్లడ్జింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరం**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు నిత్యం తనిఖీలు నిర్వహించాలని, అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు.ప్రజలను ప్లాస్టిక్ రహిత జీవనశైలికి ప్రోత్సహించేలా జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయం, ఎక్సైజ్ కాలనీ మార్కెట్ వద్ద ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను అందజేసే వారికి బట్ట సంచులు, నిత్యావసర వస్తువులు లేదా ప్రోత్సాహక నగదు అందించే విధానాన్ని రూపొందించాలని సూచించారు.

**నగర సుందరీకరణకు ప్రాధాన్యత**

నగరంలోని ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాలు, ఫ్లైఓవర్లు, బండ్ ప్రాంతాల్లో ప్రకృతి పరిరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతను ప్రతిబింబించే నేచర్‌బేస్డ్ వాల్ ఆర్ట్, ప్రేరణాత్మక సందేశాలతో కూడిన పెయింటింగ్స్ రూపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

**ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు**

నివాస ప్రాంతాల్లో పందుల పెంపకాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, హసన్‌పర్తిలో రెండో ఏబీసీ కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని సూచించారు. లాండ్రోమార్ట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, వాటర్‌లాగింగ్ ప్రాంతాలు, మురుగు కాలువల పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నివారణకు ఫాగింగ్, యాంటీ లార్వల్ చర్యలను ముమ్మరం చేయాలని, ఏ ప్రాంతంలోనైనా వ్యాధులు ప్రబలితే అక్కడ ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి వెంటనే ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, ఆస్కీ ప్రతినిధి రాజమోహన్, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రైల్వే డబ్లింగ్ భూ సమస్యపై సంయుక్త పరిశీలన

- **రైతులకు న్యాయం జరిగేలా చర్యలు- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్**

**కారేపల్లి, మహా:** డోర్నకల్ -భద్రాచలం రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు కు సేకరిస్తున్న భూములపై నెలకొన్న వివాదమై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూసేకరణ) ఆధ్వర్యంలో గురువారం రెవిన్యూ, అటవీ, రైల్వే, అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. కోమట్లగూడెం రెవిన్యూ గ్రామ పరిధిలో సర్వే నెం.67 కి చెందిన భూమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వస్తుందని అటవీ శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయమై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా భూమి హద్దులు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, అటవీ శాఖల నివేదికలు, రికార్డుల ఆధారంగా సమస్యను త్వరితగతిన పరిష్కరించే చర్యలు తీసుకుంటామని భూ నిర్వాసిత రైతులకు హామీ ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ, రికార్డులను పూర్తిగా పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం రైల్వే శాఖకు భూమిని ఏ విధంగా బదిలీ చేయాలి, పరిహారం అంశాన్ని ఎలా అమలు చేయాలనే విషయాన్ని6 స్పష్టం చేస్తామని తెలిపారు. పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. ఈ సందర్భంగా గాదెపాడు సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, భూ నిర్వాసిత రైతులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ సమస్యను వైరా ఎమ్మెల్యే శ్రీ మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి,రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో తహసీల్దార్, ఆర్ఐ, జీపీఓ, అటవీ శాఖ ఎఫ్ఆర్ఓ, డీఆర్ఓ, ఎఫ్‌బీఓ, రైల్వే శాఖ డీఈ, జేఈ, ఒడ్డుగూడెం, చర్లపల్లి, గాదెపాడు గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు రైతులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన..

- **వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి..**
- **వ్యవసాయ శాఖ అధికారుల సూచన**

**మణుగూరు, మహా :** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకుని నీటి వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని మద్దులగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఈ మేరకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి వడియాల రాహుల్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరం ఉండే వరి సాగును సాధ్యమైనంత వరకు తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కంది, పెసర, మినుములు వంటి పప్పుధాన్యాలతో పాటు జొన్న, సజ్జ, కొర్ర వంటి మిల్లెట్ల సాగు వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు మేలు చేస్తుందని తెలిపారు. వర్షపాతం పరిస్థితులను నిరంతరం గమనిస్తూ వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనల మేరకు పంటలను ఎంపిక చేసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు డాక్టర్ లక్ష్మణరావు, హారికలు ఎల్‌నినో ప్రభావం, నీటి యాజమాన్య పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ కలబోయిన మాధవరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో రైతులు కాటాబోయిన నారాయణ, కొమరం మల్లూరు, కొమరం నాగార్జున, కొమరం జనార్దన్తో పాటు పలువురు రైతులు పాల్గొని అధికారుల సూచనలను ఆసక్తిగా విని పంటల ఎంపిక, సాగు విధానాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

# అటవీ అధికారుల వేధింపులతో రైతు ఆత్మహత్యాయత్నం

- **అటవీ అధికారులపై హత్యాయత్నం కేసు పెట్టాలి**
- **బిజెపి రాష్ట్ర నేత కొయ్యల ఏమాజి డిమాండ్**

బెల్లంపల్లి ,మహా:అటవీశాఖ అధికారులు వేధింపులకు గురి చేయడం, భూమిని సాగు చేయనివ్వకపోవడంతో నూకల తిరుపతి అనే పేద రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేశారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి విమర్శించారు. గురువారం రోజు వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి చెందిన నూకల తిరుపతి అనే రైతు పురుగుల మందు తాగి బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొయ్యల ఏమాజి ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ ఏడాది అటవీశాఖ అధికారులు వ్యవసాయ పంటలు సాగు చేయనివ్వకపోవడం వల్లనే మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి కారణమైన అటవీశాఖ అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని లేకుంటే దాడులు తప్పవని హెచ్చరించారు.





# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలి..

- **టీజీ ఎన్ పీడీసీఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి..**

**మణుగూరు, మహా :** ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. గురువారం మణుగూరులోని 33/11 కిలోవోల్ట్ల విద్యుత్ సబ్ స్టేషన్, సబ్ స్టేషన్ కార్యాలయం, విద్యుత్ ఆదాయ కార్యాలయాన్ని ఆయన సందర్శించి అక్కడి పనితీరు, విద్యుత్ సరఫరా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు నిర్వహణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జి. మహేందర్, డివిజనల్ ఇంజనీర్ కె. జీవన్ కుమార్, సహాయ విభాగ ఇంజనీర్ డి. ఉమామహేశ్వరరావుతో పాటు విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భయమే నన్ను బిజీ హీరోయిన్‌గా మార్చింది

సీనియర్ నటుడు దివంగత రాజేష్ కుమార్తె ఐశ్వర్య రాజేష్ తమిళ చిత్ర పరిశ్రమలో కథానాయికగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఇప్పటికే తమిళంలో ముప్పై ఐదు చిత్రాల్లో నటించిన ఆమె, తెలుగులో నటించిన ఆరో చిత్రం 'బోసు కుమారి' విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.సినీ రంగంలో కథానాయికగా అడుగుపెట్టిన తొలి రోజుల్లోనే తనకు పలువురు ఒకే మాట చెప్పారని ఐశ్వర్య తెలిపారు. హీరోయిన్ కెరీర్ ఎక్కువ కాలం ఉండదని, మూడు నుంచి నాలుగేళ్లకే అవకాశాలు తగ్గిపోతాయని భయపెట్టారని గుర్తు చేసుకున్నారు. ఆ మాటలు తనపై తీవ్ర ప్రభావం చూపాయని, అందుకే వచ్చిన ప్రతి మంచి అవకాశాన్ని వదులుకోకుండా వరుసగా సినిమాలు ఒప్పుకున్నానని చెప్పారు.

ఇప్పటివరకు తమిళంలో ముప్పై ఐదు చిత్రాలు పూర్తి చేశానని, తెలుగులో 'బోసు కుమారి' తన ఆరో సినిమా అని తెలిపారు. అలాగే మలయాళంలో కూడా ఐదు చిత్రాల్లో నటించినట్లు వెల్లడించారు. హీరోయిన్‌గా అవకాశాలు ఎప్పుడైనా తగ్గిపోవచ్చనే ఆందోళనతోనే తక్కువ సమయంలో ఎక్కువ సినిమాలు చేశానని చెప్పారు.పాత్రకు ప్రాధాన్యం ఉంటే అది హీరోయిన్ పాత్రా, సహాయ పాత్రా అనే విషయాన్ని ఎప్పుడూ పట్టించుకోలేదని ఐశ్వర్య స్పష్టం చేశారు. 'టక్ జగదీష్' వంటి చిత్రాల్లో కూడా మంచి పాత్రల కోసం నటించానని చెప్పారు. తనలో నాటిన ఆ భయమే మరింత కష్టపడేలా చేసి, విభిన్న పాత్రలు చేయడానికి ప్రేరణగా నిలిచిందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం కూడా కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలకే తొలి ప్రాధాన్యం ఇస్తూ తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన యువ నటి, సామాజిక మాధ్యమాల ప్రముఖురాలు సుప్రీత నాయుడు తన అందం, అభినయంతో క్రమంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటోంది. ఈ అందమైన స్టూడియో చిత్రంలో ఎరుపు రంగు మడతలతో రూపొందించిన ఆధునిక ద్విభాగ వస్త్రధారణలో ఆమె ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఒకవైపు జారిన పొడవాటి నల్లని జుట్టు, మెడలో మెరిసే పచ్చరత్నాల హారం, ఆత్మవిశ్వాసంతో కూడిన చూపు ఆమె వ్యక్తిత్వాన్ని మరింత అందంగా ప్రతిబింబిస్తున్నాయి. సొగసు, ఆత్మవిశ్వాసం, ఆధునికత కలబోసిన ఈ రూపం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.ప్రముఖ తెలుగు నటి సురేఖ వాణి కుమార్తె అయిన సుప్రీత నాయుడు 2001 ఆగస్టు 8న హైదరాబాద్‌లో జన్మించింది. చిన్న వయసులోనే సామాజిక మాధ్యమాల ద్వారా మంచి ఆదరణ పొందిన ఆమె, నృత్య ప్రదర్శనలు, ఫోటోషూట్లు, వినోదాత్మక వీడియోలతో యువతలో ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంది. నటిగా తన ప్రయాణాన్ని లఘు చిత్రాలు, సంగీత వీడియోల ద్వారా ప్రారంభించిన సుప్రీత, 2019లో విడుదలైన 'మనీ మైండెడ్ గర్ల్‌ఫ్రెండ్' అనే లఘు చిత్రంతో నటిగా తొలి అడుగు వేసింది. ఆ తర్వాత తన నటనను మెరుగుపరుచుకుంటూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది.

ప్రస్తుతం సుప్రీత తన తొలి పూర్తి స్థాయి కథానాయిక చిత్రంగా తెరకెక్కుతున్న 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా బిగ్‌బాస్ ద్వారా మంచి గుర్తింపు పొందిన అమర్‌దీప్ చౌదరి నటిస్తున్నారు. ప్రేమకథా నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ఈ సినిమా డబ్బింగ్ పనుల్లో సుప్రీత బిజీగా ఉంది. డబ్బింగ్ స్టూడియోలో తన తల్లి సురేఖ వాణితో కలిసి గడిపిన భావోద్వేగ క్షణాలను కూడా ఆమె అభిమానులతో పంచుకోవడం విశేషం.


సామాజిక మాధ్యమాల్లో లక్షలాది మంది అనుచరులను కలిగి ఉన్న సుప్రీత, తన నృత్య ప్రతిభ, స్టైలిష్ ఫ్యాషన్, ఆత్మవిశ్వాసభరితమైన వ్యక్తిత్వంతో యువతకు మరింత చేరువవుతోంది. నటిగా తన ప్రతిభను నిరూపించుకోవాలనే లక్ష్యంతో క్రమంగా ముందుకు సాగుతున్న ఆమెకు తెలుగు చిత్రసీమలో మంచి భవిష్యత్తు ఉందనే అభిప్రాయం సినీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. తొలి చిత్రం విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో సుప్రీత తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎర్రని వస్త్రధారణలో మెరిసిన సుప్రీత నాయుడు



# లెనిన్ దూకుడు కొనసాగుతుందా?

ఒక సినిమా హిట్ కావడం ఒక ఎత్తయితే.. ఆ విజయాన్ని ఎంతకాలం కంటిన్యూ చేయగలిగిందన్నది మరో ఎత్తు. ప్రస్తుతం అక్కినేని అఖిల్ నటించిన లెనిన్ విషయంలో ఇదే చర్చ సాగుతోంది. తొలి వారం సక్సెస్ ఫుల్ గా పూర్తి చేసుకున్న ఆ సినిమా ఇప్పుడు రెండో వీకెండ్ లోకి అడుగుపెడుతోంది. ముఖ్యంగా వీకెండ్ లో పెద్ద తెలుగు సినిమాలు లేకపోవడం లెనిన్ కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే మంచి రెస్పాన్స్ దక్కించుకున్న లెనిన్ ప్రేక్షకుల్లో పాజిటివ్ టాక్ సంపాదించుకుంది. చాలా కాలం తర్వాత అఖిల్ కు వచ్చిన కమర్షియల్ హిట్ కావడంతో అభిమానులు కూడా సినిమాకు అండగా నిలుస్తున్నారు. ఇదే జోరు కలెక్షన్లలో కూడా కనిపిస్తోంది. తొలి వారం ముగిసే సమయానికి సినిమా మంచి వసూళ్లు నమోదు చేసినట్లు తెలుస్తోంది.



సాధారణంగా ప్రతి శుక్రవారం కొత్త సినిమాలు విడుదలవుతుంటాయి. వాటిలో ఏదైనా పెద్ద సినిమా ఉంటే ప్రేక్షకుల దృష్టి వెంటనే ఆ సినిమా వైపు మళ్లిపోతుంది. అయితే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ వారంలో విడుదలవుతున్న చిత్రాల్లో ఎక్కువగా చిన్న సినిమాలే ఉన్నాయి. వాటిలో కొన్ని కథాపరంగా ఆసక్తికరంగా ఉన్నప్పటికీ, ప్రేక్షకుల్లో భారీ అంచనాలు కనిపించడం లేదు. విడుదలకు ముందు నుంచే పెద్ద చర్చకు దారి తీసిన సినిమా కూడా లేకపోవడం గమనార్హం.

ఇదే లెనిన్ మూవీకి ప్రధాన బలంగా మారే అవకాశముంది. ఇప్పటికే థియేటర్లలో మంచి ఆక్యుపెన్సీతో కొనసాగుతున్న ఆ చిత్రానికి మరో వీకెండ్ అదనంగా దక్కినట్లే. కొత్తగా వచ్చే చిత్రాలు ఎలాంటి ఎఫెక్ట్ చూపకపోతే ఫ్యామిలీ ఆడియన్స్, యువత మళ్లీ లెనిన్ నే ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న పట్టణాలు, బీసీ సెంటర్లలో సినిమా ఇంకా బలంగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు గుంటూరులో నిర్వహించిన సక్సెస్ మీట్ కు అభిమానులు భారీగా హాజరయ్యారు. సినిమా విడుదలై రోజులు గడుస్తున్నా ప్రేక్షకుల్లో ఆసక్తి తగ్గలేదనే అక్కడ వారిని చూస్తే అర్థమవుతుంది. సోషల్ మీడియాలో కూడా సినిమాకు సంబంధించిన చర్చ కొనసాగుతుండటం మూవీ టీమ్ కు ఊరటనిస్తోంది. అయితే ఇండస్ట్రీలో ఒక మాట తరచూ వినిపిస్తుంది. మంచి టాక్ తో వచ్చిన సినిమాకు పెద్ద పోటీ లేకపోతే అది మరికొన్ని వారాలు బలంగా నిలుస్తుందని. ప్రస్తుతం లెనిన్ కు అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి.

కొత్త సినిమాల నుంచి గట్టి సవాల్ లేకపోవడం, ఇప్పటికే ప్రేక్షకుల్లో గుర్తింపు సంపాదించుకోవడం వంటి అంశాలు లెనిన్ చిత్రానికి కలిసి వచ్చే అవకాశముంది. ఏదేమైనా వీకెండ్ లో బాక్సాఫీస్ వద్ద ఆ మూవీకి అనుకూల పరిస్థితులే కనిపిస్తున్నాయి. చిన్న సినిమాలు తమదైన స్థాయిలో ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రేక్షకుల ఫస్ట్ సెలక్షన్ గా మాత్రం లెనిన్ కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఓపెన్ గ్రౌండ్ లెనిన్ దే.. చిన్న సినిమాలు నిజంగానే సైడ్ అయినట్లేనా? అనే చర్చ సాగుతోంది.

# ఫౌజీకి డిసెంబర్‌లో గట్టి బాక్సాఫీస్ పోటీ?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఫౌజీ' విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. విడుదల తేదీ ఖరారైన వెంటనే డిసెంబర్ బాక్సాఫీస్ పోటీపై సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చ మొదలైంది.

ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'ఫౌజీ' విడుదలైన మరుసటి రోజే బాలీవుడ్ స్టార్ హీరోలు అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్ నటిస్తున్న రెండు భారీ చిత్రాలు కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది. ఒకే వారంలో మూడు భారీ చిత్రాలు విడుదలైతే ముఖ్యంగా హిందీ మార్కెట్ లో వసూళ్లపై ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

అంతేకాకుండా, 'ఫౌజీ' విడుదలైన రెండు వారాల వ్యవధిలోనే హాలీవుడ్‌కు చెందిన భారీ చిత్రాలు 'అవెంజర్స్', 'డ్యూన్' కూడా థియేటర్లలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రచారం సాగుతోంది. దీంతో ఐమ్యాక్స్, 4డీఎక్స్ వంటి ప్రీమియం స్క్రీన్ల కేటాయింపుపై తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఉత్తర భారత మార్కెట్ లో స్క్రీన్‌ల పంపిణీ కీలక అంశంగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మరోవైపు, అక్షయ్ కుమార్ నటిస్తున్న చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారనే వార్తలు కూడా చర్చనీయాంశంగా మారాయి. దీంతో **'ఫౌజీ'**తో నేరుగా బాక్సాఫీస్ పోటీ ఉంటుందా? లేక విడుదల తేదీల్లో మార్పులు చోటు చేసుకుంటాయా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.

అయితే ఈ విడుదల తేదీలకు సంబంధించి అన్ని చిత్రాల నుంచి తుది షెడ్యూల్‌లు ఇంకా మారే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయినప్పటికీ, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే డిసెంబర్‌లో ప్రభాస్ **'ఫౌజీ'**కి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ చిత్రాల నుంచి కూడా గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముందని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## 'ఓజీ 2'తో పాటు 'బ్లడీ రోమియో'పై

# సుజీత్ ఫోకస్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన 'ఓజీ'తో దర్శకుడు సుజీత్ భారీ విజయాన్ని అందుకున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లు సాధించి, పవన్ కళ్యాణ్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో సుజీత్ పేరు మరోసారి టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

ఇటీవల 'ఓజీ 2'పై అధికారిక ప్రకటన రావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. పవన్ కళ్యాణ్‌ను సుజీత్ మర్యాదపూర్వకంగా కలిసి కథపై చర్చించినట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అనంతరం నిర్మాణ సంస్థ కూడా సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది.

అయితే 'ఓజీ 2' ప్రకటన వచ్చినప్పటికీ, ప్రస్తుతం సుజీత్ తన తదుపరి చిత్రం 'బ్లడీ రోమియో' పనుల్లో పూర్తిగా నిమగ్నమైనట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. నేచురల్ స్టార్ నాని హీరోగా రూపొందనున్న ఈ యాక్షన్ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయని సమాచారం. సాంకేతిక బృందం ఎంపికతో పాటు చిత్రీకరణకు అవసరమైన ప్రధాన లొకేషన్లను ఖరారు



చేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలోని కీలక భాగాన్ని లండన్‌లో చిత్రీకరించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, అక్కడి లొకేషన్లను కూడా ఇప్పటికే ఫైనల్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో సంగీత విభాగంలోనూ పనులు ప్రారంభమైనట్లు, ఇప్పటికే రెండు బాణీలకు తుది రూపం ఇచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ప్రస్తుతం నాని తన ఇతర కమిట్‌మెంట్‌లను పూర్తి చేసి షూటింగ్‌కు అందుబాటులోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించేలా చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సమాచారం. మరోవైపు పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కనున్న 'ఓజీ 2'కు సంబంధించిన సన్నాహాలు కూడా సమాంతరంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా, సెప్టెంబర్ 2 సందర్భంగా 'ఓజీ 2' నుంచి ప్రత్యేక పోస్టర్, టీజర్ లేదా మరేదైనా అప్డేట్ విడుదలయ్యే అవకాశముందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. అభిమానులు మాత్రం తదుపరి అప్డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com